




# ముగ్గురూ.. ముగ్గురే..!

## టౌన్ ప్లానింగ్‌లో భారీగా వసూళ్ల పర్వం




- సెల్లార్‌కు రూ.3 లక్షల నుంచి రూ.5లక్షలు
- బెటర్‌మెంట్ చార్జెస్ వద్దు.. ముడుపులిస్తే చాలు..
- నగర పాలక సంస్థలో ముగ్గురు మేడమ్‌ల దందా

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నగరంలో అక్రమ కట్టడాలు పెరిగిపోతున్నాయి. అదే స్థాయిలో నగరపాలక సంస్థలో అక్రమార్జన పెరుగుతోంది. టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం, వారిలో కొందరి అవినీతి దీనికి కారణమనే ఆరోపణలు వస్తున్నాయి. రహదారులను ఆక్రమించి భవంతులను నిర్మిస్తున్నారు. దీంతో బైకు వెళ్లేందుకూ దారి కనిపించని పరిస్థితి ఏర్పడింది. డ్రైనేజీ కాలువలను ఆక్రమించి నిర్మించిన భవంతులకు లెక్కే లేదు. గాలి, వెలుతురుకు(సెట్ బ్యాక్స్) అవకాశం లేకుండా ఒకదాని పక్కన మరొక భవనాన్ని నిర్మిస్తున్నారు. సెల్లార్‌లకు అనుమతి లేకపోయినా.. 70 శాతం సెల్లార్లపైనే భవనాలను కడుతున్నారు. ఇన్ని అక్రమాలకు టౌన్ ప్లానింగ్‌లోని ముగ్గురు మహిళా అధికారుల తీరే కారణమని ప్రచారం జరుగుతోంది. అక్రమ కట్టడమని నోటీసు ఇవ్వడం... వారి నుంచి పైసలు పుచ్చుకోవడం రివాజుగా మారిందని అంటున్నారు. కార్పొరేషన్‌కు చెందిన ఖాళీ స్థలాలలో బోర్డులు పెట్టాలన్న ఆలోచన కూడా చేయడంలేదు. వీరి ఒత్తిళ్లతోనే అసిస్టెంట్ సిటీ ప్లానర్ పోస్టులోకి వచ్చిన వారు కొన్ని నెలలకే సెలవులోనో, బదిలీపైనో వెళుతున్నారని అంటున్నారు.



సప్తగిరి సర్కిల్ సమీపంలో కట్టిన బిల్డింగ్

### కాసులిచ్చుకో.. సెల్లార్ కట్టుకో..

కార్పొరేషన్ పరిధిలో సెల్లార్లకు అనుమతి లేదు. సిల్ట్ పేరుతో చాలా భవనాలకు సెల్లార్లు ఏర్పాటు చేస్తున్నారు. వాటిని పార్కింగ్‌కు కాకుండా, వాణిజ్య అవసరాలకు వాడేస్తున్నారు. ఇలాంటి భవనాలు కనిపిస్తే టౌన్‌ప్లానింగ్ అధికారులకు పండగే. వెంటనే నోటీసు జారీ చేసి, పని నిలిపేయమంటారు. దీంతో ఆ బిల్డర్, లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్.. ఎవరో ఒకరు బేరానికి వస్తారు. సెల్లార్‌కైతే రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు బేరసారాలు సాగుతున్నాయి. ఆ డబ్బు అందాక మిగిలిన వ్యవహారం చూస్తారు. సెట్‌బ్యాక్స్ ఉన్నాయా...? కమర్షియల్‌గా ఉపయోగిస్తున్నారా...? ఎన్ని అంతస్తులు నిర్మిస్తున్నారు అనేది కీలకం. వాటిలో తేడా ఉంటే మరో రూ.2 లక్షలు చదివించుకోవాల్సిందే. టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఓ మేడమ్ ఉన్నతాధికారిగా వ్యవహరిస్తున్నారు. ఆమె క్షేత్రస్థాయికి వెళ్లరు. ఫుట్‌పాత్‌పై తోపుడుబండ్లుంటే మేడమ్‌కు నచ్చదట. వెంటనే మనుషులను పంపి వాటిని తొలగించేస్తారు. కానీ భారీ భవంతులను ఎలా కట్టినా పట్టించుకోరు. కార్పొరేషన్‌లోనే చాలా పవర్‌ఫుల్ మేడమ్ అని అంటారు. చాలా మామూలుగా ముడుపులు అందుకుంటారని కూడా ప్రచారం ఉంది. కొత్తగా వచ్చిన ఓ మేడమ్... బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ చేపట్టే చోట వాలిపోతారట. ప్రతి బిల్డింగ్ నుంచి మర్యాదపూర్వకంగా వసూలు చేస్తారట. నెలన్నర వ్యవధిలో కేవలం ఒక్క కమలానగర్‌లోనే 4 సెల్లార్లున్న బిల్డింగ్‌లు కడుతున్నారు. వీటిని స్థానిక ప్లానింగ్ సెక్రటరీ టౌన్‌ప్లానింగ్.. అధికారులందరికీ చూపించాడట. అవునా.. అని చెప్పి నోటీసులిచ్చారట. ఆ నాలుగింటి నుంచి రూ.20 లక్షలు వసూలైనట్లు సమాచారం.



కమలానగర్‌లోని సెల్లార్

### బెటర్‌మెంట్ చార్జెస్‌కు మంగళం

నగరంలో 14 శాతం బెటర్‌మెంట్ చార్జెస్ చెల్లించకుండానే భవనాలకు అప్రూవల్స్ ఇస్తున్నారు. ఇలా ఏటా రూ.10 కోట్లకుపైగా నగరపాలక సంస్థ ఆదాయానికి గండిపడుతోంది. సప్తగిరి సర్కిల్ సమీపంలోని పెట్రోల్ బంకు వెనుక వీధిలో ఐదంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. ఆ భవనానికి 14శాతం బెటర్‌మెంట్ చార్జెస్ చెల్లించకుండా.. దాదాపు రూ.20లక్షలు ఎగనామం పెట్టారు. ఇక్కడ టౌన్‌ప్లానింగ్ అధికారులకు రూ.5లక్షల వరకు ముట్టినట్లు సమాచారం. కోవూరునగర్‌లో రెండు భవనాలు, రామ్‌నగర్, శ్రీనగర్ కాలనీల పరిధిలో మూడింటికి ఇలా ఎగ్గొట్టినట్లు సమాచారం. ఇలాంటి భవనాల నుంచి రూ.15లక్షల నుంచి రూ.20లక్షల వరకు లాగేసుకుంటారని సమాచారం. ఫెర్రర్‌నగర్ పరిధిలో ఆర్డీటీ ఆఫీస్ ఎదురుగా ఉన్న భవనానికి 14శాతం చార్జెస్ చెల్లించలేదు. 35 సెంట్లలో కడుతున్న ఈ నిర్మాణానికి రూ.60 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. అధికారులకు, స్థానిక నాయకులకు ముడుపులు అందాయట. నగర పాలక సంస్థలో మేడమ్‌ల ఆధిపత్యం ఆరంభమయ్యాక ఇలాంటి భవనాల సంఖ్య బాగా పెరిగినట్లు సమాచారం. ఏటా అధికారుల జేబుల్లోకి రూ.50లక్షల వరకు వెళ్తోందని తెలిసింది.

### అనుమతి తీసుకోకుండానే..

కోవూరునగర్‌లో సర్వే నంబరు 53/1ఏ, ప్లాట్ నంబర్-12లో కుమారమ్మ పేరుతో ఉన్న ఐదు సెంట్ల స్థలాన్ని మరొకరు ఆక్రమించారు. కంబగిరి శశికళ పేరుతో అందులో ఐదంతస్తుల భవంతిని కడుతున్నారు. ఇందుకు టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతి ఇవ్వలేదు. కార్పొరేషన్‌కు నామినల్ ఫీజు కూడా చెల్లించలేదు. కేవలం రూ.60వేలతో దరఖాస్తు చేశారు. నాన్ లే అవుట్ కింద 14 శాతం బెటర్‌మెంట్ చార్జెస్‌లో భాగంగా రూ.14 లక్షలు, ఇతర ఫీజుల కింద రూ.3 లక్షలు మొత్తం రూ.17 లక్షలు ఎగనామం పెట్టారు. 20 అడుగుల రోడ్డులో ఐదడుగులు మార్ట్‌గేజ్ చేయించాలి. కానీ చేయించలేదు. ఈ వ్యవహారంలో టౌన్‌ప్లానింగ్ అధికారులకు రూ.5 లక్షలు ముట్టాయనే ఆరోపణలున్నాయి. ఈ విషయంపై బాధితులు ఫిర్యాదు చేస్తే, ప్రస్తుత డీసీపీ శిరీష గతేడాది ఆగస్టులో నోటీసు జారీ చేశారు. ఎలాంటి చర్యలూ లేవు. ఇక ఏం చేయలేమనీ, కావాలంటే డబ్బు ఇప్పిస్తామని అన్నారట. ఆ భవనం వెనుక ఉండి బిల్డర్ అవతారమెత్తింది కూడా కార్పొరేషన్‌లో పనిచేసే జూనియర్ అసిస్టెంటేనట. ఇతను ఆ మేడమ్‌ల ఆశీర్వాదంతో కొన్ని భవనాలు నిర్మించినట్లు సమాచారం. ప్రతి భవనం నుంచి వారికి ముడుపులు, అతడికి కమీషన్లు అందుతాయని సమాచారం.



కోవూరునగర్‌లో శశికళ పేరుతో ఆక్రమించి నిర్మించిన భవనం

### ఆ మేడమ్‌కే ఎందుకంటే..

టీపీఎస్‌గా పనిచేస్తున్న ఓ మేడమ్ ప్రస్తుతం గర్భిణి. తాజాగా ధర్మవరానికి బదిలీపై వెళ్లిన ఆమె మళ్లీ ఇక్కడకే వచ్చారు. ఆమెకు ఏకంగా 38 నుంచి 74వ సచివాలయం వరకు ఉన్న నగరంలోని ప్రాంతాలన్నీ పర్యవేక్షించాల్సిన బాధ్యతను ఉన్నతాధికారి అప్పగించారు. ఆమె క్షేత్రస్థాయిలోకి వెళ్లడానికి వీలుకాదు. అయినా, అప్పగించారు. బాగా ఆదాయమొచ్చే ప్రాంతాలను అప్పగించడం వెనుక ఉన్నతాధికారికి ముడుపులు బాగా రావాలనే ఆకాంక్ష ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్లానింగ్ సెక్రటరీల నుంచి అవసరమైన ఫైల్స్‌ను వెంటనే రప్పించుకుని అప్రూవల్స్ ఇచ్చేస్తారట. వేటినీ నిర్మాణ స్థాయిలో ఆపరు. ఎందుకు ఆపలేదని నిలదీస్తే నోటీసు ఇచ్చేసి చేతులు దులిపేసుకుంటారు. గంగానగర్‌లో ఎప్పుడో శ్రీనివాసులు పేరుతో నిర్మించిన మూడు విల్లాలకు తాజాగా నవంబరు, డిసెంబరు నెలల్లో అప్రూవల్స్ ఇచ్చారు. ఇందులో ఇద్దరు మేడమ్‌లకు భారీ నజరానా అందిందట. ఉన్నతాధికారి అయిన మేడమ్.. డబ్బు విషయంలో చాలా స్ట్రిక్టుగా ఉంటారట. డబ్బు అందితేనే ఫైల్ అప్రూవల్ అనీ, లేదంటే షార్ట్‌ఫాల్స్‌లోకి పెట్టేస్తారని ప్రచారం ఉంది. డాక్యుమెంట్స్ స్కాన్ చేయలేదనీ, ప్లాన్స్ కనిపించలేదని చెబుతారట. ఇక మరో మేడమ్ నేరుగా పార్టీలతో బేరసారాలు కుదుర్చుకుంటారు. ఫైల్స్ తనకే పంపాలని ఎల్‌టీపీలకు చెబుతారు. కొత్త కమిషనర్ కేవలం 10 భవనాలను ఆరాతీసినా గుట్టు బయటపడుతుంది. మరి కమిషనర్ బాలస్వామి ఆ దిశగా అడుగులు వేస్తారా..? లేదా..? వేచి చూడాల్సిందే.



కమలానగర్‌లో సెల్లార్‌తో నిర్మిస్తున్న భవనం



ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఈ రోడ్డులో గతంలో పీవీకేకే కళాశాల మాత్రమే కనిపించేది.. ఇప్పుడు ఆ కళాశాల ఉందో.. లేదో తెలియనంతగా రోడ్డుపై భవనాలను నిర్మించారు

# స్టాంప్ బ్లాక్

## నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత

- ఇదే అదనుగా నాలుగు రెట్ల ధరకు విక్రయం
- వెండర్లతో రిజిస్ట్రేషన్ అధికారుల లాలూచీ..?



గుత్తి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

గుత్తి, మడకశిర టౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత వేధిస్తోంది. ఆస్తుల రిజిస్ట్రేషన్లు, బ్యాంకు రుణాలు, సిరాస్థి ఒప్పందాలు, అఫిడవిట్లు తదితరాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలామంది రిజిస్ట్రేషన్లను వాయిదా వేసుకుంటున్నారు. మరికొందరు ఇతర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. గుత్తి నుంచి పామిడి, యాడికి, నంద్యాల జిల్లా ప్యాపిలి తదితర ప్రాంతాలకు వెళుతున్నారు. మడకశిర ప్రాంతంవారు అనంతపురం, హిందూపురం వెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారు. గుత్తిలో వారం రోజులుగా స్టాంపుల కొరత కొనసాగుతోంది. అగ్రిమెంటు గడువు దాటిపోతున్నవారు ఆందోళన చెందుతున్నారు. స్టాంపు వెండర్లు కృత్రిమ కొరత (తరువాయి 7లో..)



### లాలూచీ పడలేదు..

వారం రోజులుగా గుత్తిలో స్టాంపుల కొరత ఉందని ఇన్చార్జి సబ్ రిజిస్టర్ మంజునాథ యాదవ్ అన్నారు. స్టాంపులు వచ్చినప్పుడు అందరికీ సమానంగానే ఇస్తున్నామని అన్నారు. అమరావతి నుంచి నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌లు సరఫరా కాకపోవడంతో కొరత ఏర్పడిందని, తాము ఎవరితోనూ లాలూచీ పడటం లేదని అన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే బాధితులు ఫిర్యాదు చేయాలని, వెండర్ల లైసెన్సులు రద్దు చేస్తామని అన్నారు.




# అమ్మ పాడే జోల పాట

మా బుజ్జి కదా..!
నా బంగారు కొండా..!
నా రతనాల మూటా..!
హాయిగా పడుకో నాన్నా
పాలు తాగావు కదా..
బొజ్జ నిండింది కదా
ఇంక కాసేపు పడుకో నాన్నా..! లాలిపాట పాడనా..?
వింటూ హాయిగా నిదురపో కన్నా..! అమ్మకు ట్రైనింగ్ ఉంది కదా..!
నువ్వు కాసేపు కునుకుతీ బంగారం.. అంటూ ఓ తల్లి ఇలా తన ఏడు నెలల పసిబిడ్డను లాలించింది.



యాడికి హైస్కూల్‌లో ఊయలలో పిల్లాడిని నిద్రపుచ్చుతున్న అంగన్‌వాడీ టీచర్



శిక్షణలో అంగన్‌వాడీ టీచర్లు

ఈ దృశ్యం యాడికి జడ్పీ హైస్కూల్‌లో బుధవారం కనిపించింది. మండల కేంద్రంలో గత రెండు రోజులుగా అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి పథకంపై శిక్షణ ఇస్తున్నారు. ఈక్రమంలోనే తన ఏడు నెలల కుమారుడితో బుధవారం ఓ అంగన్‌వాడీ టీచర్ ఈ శిక్షణకు హాజరయ్యారు. తన బిడ్డ వల్ల శిక్షణకు ఇబ్బంది కలగకూడదని, శిక్షణ గది పక్కనే ఉన్న చెట్టుకు, స్తంభానికి ఉయ్యాల కట్టి, అందులో పడుకోబెట్టింది. బిడ్డను నిద్ర పుచ్చడం కోసం కాసేపు ఇలా లాలిపాట పాడింది. అదిచూసిన వారంతా అయ్యోపాపం చిన్నారి సంరక్షణకు ఆ తల్లి ఎంత ఇబ్బంది పడుతోందో అని చర్చించుకోవడం కనిపించింది. ఇలాంటివారికి శిక్షణ నుంచి మినహాయింపు ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్లు కోరుతున్నారు. (ఆంధ్రజ్యోతి, యాడికి)





# మళ్లీ దెబ్బ..!

- రైల్వేలైన్ కోసం భూసేకరణ
- ఇదివరకే ఓ ట్రాక్ నిర్మాణం
- రెండింటి మధ్య మిగలనున్న భూమి
- తీవ్ర నష్టం అంటున్న బాధిత రైతులు

వివరాలు 6లో

# బీసీ రుణం

- సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలకు భారీగా హాజరు
- చేతులెత్తేసిన మున్సిపల్ అధికారులు
- ఏర్పాట్లపై అభ్యర్థుల అసహనం, వాగ్వాదం



ఇంటర్వ్యూలకు పెద్దఎత్తున హాజరైన అభ్యర్థులు

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ల కింద సబ్సిడీ రుణాల మంజూరు కోసం బుధవారం మధ్యాహ్నం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. మొత్తం 100 యూనిట్లకు గాను 1200 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మున్సిపల్ అధికారులు బ్యాంకుల వారిగా ఇంటర్వ్యూలను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శించారు. ఎంతసేపటికీ ఇంటర్వ్యూలు ప్రారంభం కాకపోవడంతో అభ్యర్థులు అసహనం వ్యక్తం చేశారు. సహనం కోల్పోయి కౌన్సిల్ హాల్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నం చేశారు. భారీగా వచ్చిన అభ్యర్థులను చూసి కొంత మంది బ్యాంక్ అధికారులు లోపలికి రాకుండానే వెనుదిరిగి వెళ్లిపోయారు. మహిళలు, చంటిబిడ్డలతో వచ్చిన తల్లులు ఉక్కపోతతో అల్లాడిపోయారు. ఇంటర్వ్యూలను కార్యాలయం బయట ఏర్పాటు చేయకుండా కౌన్సిల్ హాల్‌లో ఎలా ఏర్పాటు చేస్తారని అభ్యర్థులు మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్‌తో వాదనకు దిగారు. టూటౌన్ సీఐ మస్తాన్ తన సిబ్బందితో మున్సిపల్ కార్యాలానికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. యూనియన్ బ్యాంక్ మాత్రమే కొద్ది మందికి ఇంటర్వ్యూలను నిర్వహించింది. ఇంటర్వ్యూలను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. దీంతో ఇంటర్వ్యూలకు వచ్చిన అభ్యర్థులు వెనుదిరిగి వెళ్లిపోయారు.

# అయ్యో.. అక్కమ్మా..!

- ప్రాధాన్యం లేని పోస్టుకు పీడీ వనజా అక్కమ్మ
- జూన్‌లో రిటైర్ కానున్న ఐసీడీఎస్ పీడీ
- బలవంతంగా సాగనంపిన వైనం
- సీనియర్లకా... జూనియర్‌కా..?

అనంతపురం విద్య, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అయిన వాళ్లకు పట్టం కట్టాలంటే ఉన్నవాళ్లను సాగనంపాలి. పోస్టు ఖాళీ చేయిస్తే మన అనుకున్నవాళ్లకు మళ్లీ పట్టం కట్టొచ్చు. ఈ ఫార్ములాను ఐసీడీఎస్ శాఖలో బాగా అమలు చేస్తున్నారు. అన్నిరకాలుగా అర్హులైన పీడీ వనజా అక్కమ్మను బలవంతంగా పంపించేశారు. ఐసీడీఎస్ రాష్ట్ర రీజినల్ ఆఫీస్ నుంచి ఒత్తిడి రావడంతో బుధవారం పీడీ పోస్టు నుంచి ఆమె రిలీవ్ అయ్యారు. జిల్లాలో ఉన్న సీడీపీఓల్లో వనజా అక్కమ్మ సీనియర్. దీంతో గత ఏడాది డిసెంబరులో ఆమెకు ప్రమోషన్ ఇచ్చి పీడీ బాధ్యతలు అప్పగించారు. ఆమె డిసెంబరు నెల 11న విధుల్లో చేరారు. అయితే ఆ పోస్టును ఆశించే ఓ జూనియర్ సీడీపీఓ పావులు కదిపారు. రాష్ట్ర ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులపై ఒత్తిడి తెచ్చారు. రాజకీయ బలాన్ని ఉపయోగించారు. ప్రస్తుతం పనిచేస్తున్న పీడీని ఉన్నఫలంగా జనవరి నెలలో ప్రాధాన్యంలేని మహిళా ప్రాంగణం డిస్ట్రిక్ట్ మేనేజర్‌గా వర్క్ డెప్యుటేషన్‌పై పంపించారు. అయితే ఆమె ఈ ఏడాది జూన్ 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. గౌరవంగా వెళ్దామనుకున్న ఆమెను ఉన్నఫలంగా వర్క్ డెప్యుటేషన్ వేసి అవమానించినట్లు ఆశాఖ ఉద్యోగుల్లో చర్చ సాగుతోంది. ఆమెను మంగళవారం రిలీవ్ చేస్తూ ఆర్‌జేడీ రోహిణి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పీడీ వనజాఅక్కమ్మ బుధవారం మధ్యాహ్నం రిలీవ్ అయ్యారు. ఇదంతా ఓ జూనియర్ సీడీపీఓ పదవీ దాహమేనంటూ ఆ శాఖలోని అంగన్‌వాడీ వర్కర్లు, టీచర్లు, సీడీపీఓలు చర్చించుకుంటున్నారు.

ఇప్పటి వరకూ ఐసీడీఎస్ పీడీ ఎవరన్నది తేల్చలేదు. ఉన్న పీడీని సాగనంపితే... ఆమె స్థానంలో ఇప్పటికే మరొకరిని నియమించాలి. లేదా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించాలి. అయితే ఇప్పటి వరకూ ఉత్తర్వులు బయటకు రాలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో సైతం ఓ జూనియర్‌కు పీడీగా పట్టం కట్టారు. ఐసీడీఎస్ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టరేట్ అధికారులు, కలెక్టరేట్ ఉన్నతాధికారులు ఆశీస్సులున్న ఓ జూనియర్ సీడీపీఓనే మళ్లీ ఆ సీట్లో కూర్చొనే అవకాశాలున్నాయనే అభిప్రాయం ఆ శాఖ ఉద్యోగుల నుంచి వినిపిస్తోంది. ఇప్పటికైతే పీడీ ఎవరన్నది స్పష్టత రాలేదు. గతంలో మాదిరి సీనియర్ సీడీపీఓలకు అవకాశం ఇస్తారో లేదో చూడాలి.



# మళ్లీ దెబ్బ..!

## రైల్వేలైన్ కోసం భూసేకరణ

- ఇది వరకే ఓ ట్రాక్ నిర్మాణం
- రెండింటి మధ్య మిగలనున్న భూమి
- తీవ్ర నష్టం అంటున్న బాధిత రైతులు



బైసాప్ లైన్ కోసం సేకరించనున్న భూమి

గుంతకల్లు, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): రైల్వే బైపాస్ లైన్ కోసం భూమిని కోల్పోతున్న పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముంబై రూటు నుంచి వచ్చే గూడ్సు రైళ్లు గుంతకల్లు రైల్వే స్టేషన్‌లోకి రాకుండా బైపాస్ గుండా విజయవాడ లైన్‌లోకి వెళ్లేలా చేయడానికి ట్రాక్ నిర్మాణానికి అధికారులు భూసేకరణ చేపట్టారు. గుంతకల్లు స్టేషన్‌లో విజయవాడ రైళ్లకు ఇంజన్‌ను మార్చనవసరం లేకుండా చేయడానికి ఇదివరకే ఓ బైపాస్ లైన్‌ను నిర్మించారు. ఆ లైన్ కోసం కసాపురం, గుంతకల్లు రైతులు గతంలో భూములను రైల్వేకు ఇచ్చారు. ఇప్పుడు మరలా పాత లైన్‌కు కొద్ది దూరంలో ఇంకో బైపాస్ లైన్‌ను నిర్మించడానికి రైల్వే అధికారులు తలపెట్టారు. ఇప్పుడు కూడా గతంలో భూములు కోల్పోయిన రైతుల భూములే పోతున్నాయి. దీంతో పాత లైన్‌కు అనుకుని కాకుండా కొద్ది దూరంలో ట్రాక్ నిర్మించడం వల్ల అంటే రెండు ట్రాక్‌ల మధ్య కొంత భూమి మిగిలిపోతుందని, ఇది ఎందుకూ పనికి రాకుండా పోయే ప్రమాదం ఉందని ఆయా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే లైన్‌ను నిర్మిస్తే రైలు వంతెనలు, వ్యవసాయ పైపు లైన్ల విషయంగా ఆ శాఖ నుంచి శాశ్వతంగా సమస్యలు ఎదురవుతూనే ఉంటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పాత బైపాస్‌లైన్‌పై నిర్మించిన వంతెన వల్ల తమకు ఎంతో ఇబ్బంది ఉందని, కానీ రైల్వే అధికారులు తమ కష్టాలు పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### 56 ఎకరాల కోసం సర్వే

గుంతకల్లు-ముంబై లైన్‌లో మొదటి రైల్వే స్టేషన్ అయిన వెస్ట్ గుంతకల్లు వద్ద నుంచి విజయవాడ వైపు నంచెర్ల రైల్వే స్టేషన్ వరకూ రెండో బైపాస్ లైన్ నిర్మాణానికి గత ఏడాది రైల్వే అధికారులు సర్వేచేసి, తమకు కావాల్సిన భూమిలో రాళ్లను పాతారు. యాభైమంది రైతులకు చెందిన 55.8 ఎకరాల భూమిని సేకరించడానికి రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి పంపారు. ఈ మేరకు స్థానిక డివిజనల్ రెవెన్యూ అధికారి శ్రీనివాసులు గత వారంలో రైతులను పిలిపించి చ ర్చించారు. భూమిని కోల్పోనున్న రైతులు తమ అభ్యంతరాలను తెలిపారు. భూములకు బుక్ వ్యాల్యూ ప్రకారం లెక్కగడితే మంచి పంటలు పండే నల్ల రేగడి భూములకు తగిన పరిహారాలు రావని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎకరాకు కనీసం రూ. 40 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### ఏకపక్షంగా లాక్కుంటే ఎలా?

రైల్వే బైసాప్ లైన్ కోసం అధికారులు తమతో ఏమాత్రం చర్చించకుండా ఏకపక్షంగా భూమిని లాక్కుంటున్నారని రైతులు వాపోతున్నారు. గతంలో నిర్మించిన విజయవాడ బైపాస్ లైన్‌కు అనుకుని ఇంకో బైపాస్ లైన్‌ను నిర్మిస్తే అనుకూలంగా ఉంటుందని రైతులు తెలిపారు. అలా పక్కనుంచి కాకుండా కాస్త దూరంగా రైల్వే లైన్‌ను నిర్మించడానికి ప్లాన్‌ను సిద్ధం చేశారన్నారు. దీని వల్ల లైన్లకు మధ్య మిగిలిపోయిన భూముల వల్ల రైతులకు చాలా నష్టం కలుగుతుందని, వ్యవసాయం చేయడానికి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడతాయని రైతులు వాపోతున్నారు. అవసరమైతే నీటి పైపులను రైల్వే లైన్ల కింద నుంచి వేసుకోవడానికి రైల్వే శాఖాధికారులు ఏమాత్రం అంగీకరించరని రైతులు తెలియజేస్తున్నారు. పైగా భూసేకరణ చేసిన సర్వే నంబర్లను 08 కింద చూపి సమస్యను తెచ్చిపెడతారన్నారు. మిగిలిన భూమిని అమ్ముకోవాలన్నా, తనఖా పెట్టాలన్నా సాధ్యంకాని పరిస్థితులు ఏర్పడతాయని అనుమానాలను వ్యక్తంచేస్తున్నారు.



రైతులకు సమస్యగా మారిన బైపాస్ లైన్‌లోని రైలు వంతెన

**ఎకరాకు రూ. 40 లక్షలు చెల్లించాలి: పూల రమణ, రైతు**



బాగా పంటలు పండే నల్ల రేగడి భూములను సేకరిస్తున్నారు. హంద్రీనీవా పక్కనే ఉన్నందున భూముల రేట్లు పెరిగాయి. కానీ పుస్తకాలలో ఉన్న రిజిస్ట్రేషన్ విలువలను లెక్కలోకి తీసుకుని పరిహారాలను ఫిక్స్ చేస్తారు. దీని వల్ల రైతులకు నష్టం వాటిల్లుతుంది. అలాగే రైల్వే శాఖకు ఎంత కావలిస్తే అంతమాత్రమే భూమిని సేకరిస్తే బిట్లు మిగిలిపోయి రైతులు నష్టపోతారు. కనుక రైతులకు ఇబ్బంది లేనివిధంగా బిట్లు మిగలకుండా భూమిని రైల్వే శాఖ కొనాలి.

**బైపాస్ లైన్ పక్కనే నిర్మించాలి: కేదార్‌నాథ్ రెడ్డి, రైతు**



ఇదివరకే నిర్మించిన బైపాస్ లైన్‌కు అనుకుని కొత్త బైపాస్ లైన్‌ను నిర్మించాలి. దీని వల్ల భూమి వృథా కాదు. లేదంటే రైతులకు సమస్యలు తలెత్తుతాయి. అక్కడ కొంచెం.. ఇక్కడ కొంచెం భూమి విడిపోతే వాటికి విలువ కూడా తగ్గిపోతుంది. కనుక రైల్వే అధికారులు ప్లాన్‌ను మార్చి భూమిని సేకరించాలి. రైల్వే లైన్ల కింద ట్రాక్టర్లు, బండ్లు వెళ్లడానికి అనువైన వంతెనలు నిర్మించాలి.

**కొనే భూమిని సబ్‌డివిజన్ చేయాలి: వరదరాజులు, రైతు**



రైల్వే శాఖ సేకరించే భూమిని సబ్‌డివిజన్ చేసి కొనాలి. లేదంటే డైగ్లాట్‌లో సర్వే నంబర్లు మొత్తం సీజ్ అవుతాయి. దీని వల్ల భవిష్యత్తులో మా భూములను అమ్ముకోలేము. తనఖా పెట్టలేము. కనుక రెవెన్యూ అధికారులు ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని సబ్‌డివిజన్ చేసిన తర్వాత భూమిని సేకరించాలి. గతంలో నిర్మించిన బైపాస్‌లైన్‌లో సరైన వంతెనలు నిర్మించని కారణంగా సమస్యలు ఎదుర్కొంటున్నాము. ఇప్పుడూ అదే పునరావృతం అవుతుందని ఆందోళన చెందుతున్నాం.

**త్వరలో సంప్రదిపులు చేపడతాం: శ్రీనివాసులు, గుంతకల్లు ఆర్డీవో**



రైతుల భూములను సర్వేచేసి, అభ్యంతరాలు స్వీకరించాం. రైతుల అభ్యంతరాలపై మినిట్స్‌ను రికార్డు చేసి కలెక్టరేట్‌కు పంపాము. త్వరలో జేసీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సంప్రదింపుల సంఘం (డీఎల్ఎన్‌సీ) ఏర్పాటై రైతులు, రైల్వే అధికారులను పిలిపించి చర్చలు జరుపుతారు. రైతుల అభ్యంతరాలన్నీ తప్పక పరిశీలిస్తాం. కనుక రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. రైతులు వారి వాదలను నేరుగా జిల్లా రెవెన్యూ అధికారులు, రైల్వే అధికారులకు తెలియజేయవచ్చు. భూమి ధర విషయంగా కూడా సంప్రదింపులు జరిపే అవకాశం ఉంటుంది.

---

### నేటి నుంచి
## బుగ్గరామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

- సర్వాంగ సుందరంగా ఆలయం ముస్తాబు



స్వామివారి మూలవిరాట్

తాడిపత్రి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమై మార్చి 2వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాలను కనివినీ ఎరుగని రీతిలో జరిపించడానికి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని రంగురంగుల విద్యుత్‌దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 20న శైవపుణ్యావాచనం అంకురారోపణం, 21న ధ్వజారోహణం, చిత్రగోపురం, 22న వాసుకీవాహనం, శేషవాహనం, 23న సింహవాహనం, 24న నరమృగవాహనం, 25న గజవాహనం, 26న నందివాహనం, అధికార నంది వాహనంతోపాటు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆకాశదీపోత్సవం, రాత్రి 12గంటలకు లింగోద్భవం, 27న పార్వతీసమేత బుగ్గరామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం, అనంతరం మహారథోత్సవం, 28న అశ్వవాహనం, మార్చి 1న వసంతోత్సవం, హంసవాహనం, 2న ఏకాంతోత్సవం కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

## చైన్ స్నాచింగ్

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చెరువుకట్ట మీద ద్విచక్రవాహనంపై వస్తున్న మహిళ మెడలో ఉన్న బంగారం చైనును గుర్తుతెలియని దుండగులు లాక్కొని వెళ్లిన సంఘటన బుధవారం జరిగింది. గుత్తి మండలం అప్పేదొడ్డి పల్లి గ్రామానికి చెందిన గోవిందరెడ్డి భార్య కోటేశ్వరమ్మ అనంతపురం రూరల్ పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలోని తన పుట్టింటికి మంగళవారం వచ్చారు. పుట్టింటి వారు వడిబియ్యం పెట్టారు. అనంతరం భర్తతో కలిసి అప్పేదొడ్డిపల్లి గ్రామానికి ద్విచక్రవాహనంపై బుధవారం బయల్దేరారు. బుక్కరాయసముద్రం మీదుగా చెరువుకట్టపై వెళ్తుండగా రెడ్ పల్సర్ ద్విచక్రవాహనంలో ఇద్దరు గుర్తుతెలియని దుండగులు వచ్చి కోటేశ్వరమ్మ మెడలో ఉన్న గొలుసును లాక్కొని పోయారు. దాని బరువు 250 గ్రాములు ఉందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుక్కరాయసముద్రం సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మాలలకు అన్యాయం జరిగితే సహించం

### రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): మాల సామాజికవర్గానికి అన్యాయం జరిగితే సహించబోమని రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్ అన్నారు. జిల్లాకొచ్చిన ఆయన ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయ సమావేశపు హాల్‌లో మాల సంఘాలు, ఉద్యోగులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ హయాంలో నిర్వీర్యమైపోయిన ఎస్సీ కార్పొరేషన్‌ను పునరుద్ధరిస్తామన్నారు. జీవం పోసి నిరుద్యోగ యువతకు భరోసా కల్పిస్తామన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఉండి అన్యాక్రాంతమవుతున్న స్థలాలను కచ్చితంగా కాపాడుతామన్నారు. జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో ఉన్న స్థలాలను గుర్తించాలన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఉన్న భూముల్లో పౌల్ట్రీలు శిథిలమయ్యాయన్నారు. వాటికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎస్సీ వర్గాల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా పర్యటించి అన్ని అంశాలపై లోతైన అధ్యయనం చేస్తున్నామన్నారు. కార్పొరేషన్ కార్యాలయాల్లో ఎస్సీ అభ్యర్థులకు అందిస్తున్న పథకాలు, సేవలపై సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇండస్ట్రీయల్ పాలసీలో భాగంగా ఉచిత విద్యుత్‌ను పునరుద్ధరిస్తామన్నారు. సమావేశంలో మాల కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాధిక పాల్గొన్నారు.

- రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్ ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లను పరిశీలించారు. టవర్‌క్లాక్, కలెక్టరేట్ సమీపంలో ఉన్న పలు షాపింగ్ కాంప్లెక్స్‌లను పరిశీలించి వాటి వివరాలను ఆరా తీశారు.
- జిల్లాకొచ్చిన రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్ మాల సంఘాల నాయకులు, ఉద్యోగులతో సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి జిల్లా పర్యటనలో తన దృష్టికి వచ్చిన సమస్యలు, ఎస్సీ కార్పొరేషన్ పథకాల తదితర వాటిపై చర్చించారు. ఆయనతో పాటు మాల కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాధికలు ఉన్నారు.

# ఆదాయం అంతంతే..

- ఏడాదంతా చీనీ విక్రయాలు
- లక్ష టన్నుల కాయల అమ్మకం
- అన్ సీజన్‌లోనూ మార్కెట్‌కు దిగుబడులు
- అయినా తగ్గిన ఆదాయం



మార్కెట్‌కు వచ్చిన చీనీకాయలు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అనంత చీనీ మార్కెట్‌లో గతేడాది చీనీ విక్రయాలు జోరుగా సాగాయి. ఏడాదంతా విక్రయాలు జరిగాయి. లక్ష టన్నుల కాయలు విక్రయించినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. సీజన్‌తో సంబంధం లేకుండా కాయలు మార్కెట్‌కు రావడం యార్డుకు కొంత కలిసొచ్చింది. అన్ సీజన్‌లో సైతం మార్కెట్‌కు కాయలు వచ్చాయి. ఆదాయం మాత్రం అంతంతమాత్రంగానే రావడం గమనార్హం. సీజన్‌లో ఆశించినస్థాయిలో కాయలు మార్కెట్‌కు రాకపోవడం మార్కెట్ ఆదాయంపై పడింది.

### సీజన్‌లో తగ్గినా.. అన్ సీజన్ మార్కెట్‌కు కాయలు..

చీనీ మార్కెట్ సీజన్ జనవరి, ఫిబ్రవరి నుంచి మొదలై సెప్టెంబరు వరకు కొనసాగుతుంది. గతేడాది మార్చిలో 17,909, మే నెలలో 18,116, జూన్‌లో 16,591, జూలైలో 21,482 టన్నుల చీనీ విక్రయాలు జరిగాయి. మిగిలిన నెలల్లో ఆశించిన స్థాయిలో మార్కెట్‌కు చీనీకాయలు రాలేదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. 2023 ఏడాదితో పోల్చుకుంటే.. గతేడాది కాయలు తగ్గిపోవడంతో..యార్డు ఆదాయం కొంతవరకు తగ్గినట్లు తెలుస్తోంది. అధికారుల లెక్క ప్రకారం రూ.6 లక్షల నుంచి రూ.7లక్షల మేర ఆదాయం తగ్గినట్లు చెబుతున్నారు. అన్ సీజన్‌లో కాయలు రావడం మార్కెట్ యార్డుకు కొంత వరకు కలిసొచ్చిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో చీనీకి అన్ సీజన్. ఈసారి ఈ మూడు నెలల్లోనూ మార్కెట్‌కు కాయలు వచ్చాయి. 2,295 టన్నుల కాయలు అన్‌సీజన్‌లో మార్కెట్‌కు వచ్చాయి. దీంతో రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చిందంటున్నారు.

### యార్డుకు రూ.1.67 కోట్ల ఆదాయం..

గడిచిన ఏడాది చీనీ మార్కెట్ ద్వారా రూ.1.67 కోట్ల ఆదాయం యార్డుకు వచ్చింది. గతేడాది జనవరి నుంచి ఈ ఏడాది గత నెల వరకు మార్కెట్‌కు చీనీ కాయలు వచ్చాయి. ఏడాదంతా 99,357 టన్నులు వచ్చాయి. దీంతో మార్కెట్ యార్డుకు యూజర్ చార్జెస్ రూపంలో రూ.1.67 కోట్లు వచ్చింది. ఏప్రిల్‌లో రూ.35.88 లక్షలు, మే నెలలో రూ.35.94 లక్షలు, జూన్‌లో రూ.31.99 లక్షలు, జూలైలో రూ.24.97 లక్షలు ఎక్కువగా ఆదాయం వచ్చింది. అన్ సీజన్ నెలలైన నవంబరులో రూ.3.56 లక్షలు, డిసెంబరులో రూ.1.67 లక్షల ఆదాయం సమకూరడం యార్డు ఆదాయానికి కొంత ఊరటనిచ్చింది.



**మార్కెట్‌కు వచ్చిన చీనీకాయలు సమకూరిన ఆదాయం వివరాలివీ..**

| నెల | వచ్చిన టన్నులు | యూజర్ చార్జెస్ రూపంలో వచ్చిన సొమ్ము (రూపాయల్లో) |
|---|---|---|
| జనవరి-2024 | 20 | 9,700 |
| ఫిబ్రవరి-2024 | 934 | 1,08,000 |
| మార్చి-2024 | 10,644 | 15,44,564 |
| ఏప్రిల్-2024 | 17,909 | 35,88,100 |
| మే-2024 | 18,116 | 35,94,500 |
| జూన్-2024 | 16,591 | 31,99,700 |
| జూలై-2024 | 21,482 | 24,97,250 |
| ఆగస్టు-2024 | 10,189 | 14,26,460 |
| సెప్టెంబరు-2024 | 753 | 1,36,300 |
| అక్టోబరు-2024 | 86 | 31,460 |
| నవంబరు-2024 | 1,475 | 3,56,430 |
| డిసెంబరు-2024 | 734 | 1,67,870 |
| జనవరి-2025 | 424 | 76,750 |
| మొత్తం | 99,357 | 1,67,37,084 |

### సీజన్‌లో ఆశించిన స్థాయిలో కాయలు రాలేదు



ఏడాదంగా మార్కెట్‌కు చీనీకాయలు వచ్చాయి. ఇది మార్కెట్‌కు ఆదాయం పరంగా మేలు చేసింది. సీజన్‌లో అనుకున్న మేర చీనీ ఉత్పత్తులు మార్కెట్‌కు రాలేదు. అంతకు మునుపు ఏడాది కంటే తక్కువగానే వచ్చాయి. ఈ క్రమంలో యార్డుకు కొంత ఆదాయం తగ్గింది. అన్ సీజన్‌లో కాయలు వచ్చాయి. ఈక్రమంలో సీజన్‌లో తగ్గిన ఆదాయాన్ని కొంత వరకు పూడ్చుకోగలిగాం.

- గోవిందు, ఎంపికశ్రేణి కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ యార్డు, అనంతపురం

## థ్యాంక్యూ సీఎం సర్..!

### సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

రామగిరి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నసనకోట గురుకుల పాఠశాలను జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేసినందుకు కృతజ్ఞతగా సీఎం చంద్రబాబు చిత్రపటానికి ఎమ్మెల్యే పరిటాల సునీత, విద్యార్థినులు క్షీరాభిషేకం చేశారు. గురుకుల సందర్శనకు బుధవారం వెళ్లిన ఎమ్మెల్యేకు విద్యార్థినులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అప్‌గ్రెడేషన్ వెనుక ఎమ్మెల్యే కృషి ఎంతగానో ఉందని ధన్యవాదాలు తెలిపారు. రామగిరి ప్రాంతంలో ఇంటర్ చదివే అవకాశం లేక చాలామంది బాలికలు చదువు మానేస్తున్నారని, ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు, మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లి జూనియర్ కాలేజీగా అప్‌గ్రెడేషన్ తెచ్చామని పరిటాల సునీత అన్నారు. డీఎస్పీ హేమంత్‌కుమార్ విద్యార్థిను పెన్నులను బహూకరించారు. టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్, మండ ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, నసనకోట ఉప సర్పంచ్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

## జేఎన్‌టీయూ వీసీ బాధ్యతల స్వీకరణ



వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ నూతన వీసీగా ప్రొఫెసర్ సుదర్శనరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయంలో పూజలు నిర్వహించి కుటుంబ సభ్యులు, అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఆయనకు అభినందనలు వెల్లువెత్తాయి. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య, ఓఎస్‌డీటూ వీసీ ప్రొఫెసర్ దేవన్న, డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు బోధన, బోధనేతర సిబ్బంది సుదర్శనరావుకు పుష్పగుచ్ఛాలందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ప్రముఖులు, సంఘాల నాయకులు వీసీని కలిసి అభినందనలు తెలియజేశారు.

**విద్యార్థి నుంచి గురువుగా..**

1983లో జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ పూర్తిచేసిన సుదర్శనరావు అదే కళాశాలలో ఆ సంవత్సరం ఆగస్టున అడహక్ ప్రాతిపదికన టీచింగ్ అసిస్టెంట్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, అసిసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్‌గా అంచెలంచెలుగా ఎదిగారు. 42ఏళ్ల వృత్తి జీవితంలో ఎన్నో పదవులు నిర్వహించి వాటికి వన్నె తెచ్చారు. దేశంలోని పదిమంది సీనియర్ ప్రొఫెసర్లలో ఒకరిగా గుర్తింపు పొందారు. 32ఏళ్ల పరిపాలనా అనుభవంలో 271 పరిశోధనా పత్రాలు ప్రచురించి రూ.469కోట్ల విలువైన ప్రాజెక్టులు పూర్తిచేశారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రస్తుత హెచ్‌ఓడీ అజిత, డైరెక్టర్ ప్రొఫెసర్ వైశాలి గోర్పాడే, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శశిధర్, మాజీ వీసీ రంగజనార్దన, ప్రొఫెసర్ అరుణ కాంతి లాంటి వారంతా సుదర్శనరావు శిష్యులు కావడం గమనార్హం.

## ఆస్పత్రిలో తిట్ల దండకం

రాయదుర్గం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బొమ్మనహాళ్ ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది మధ్య జరుగుతున్న అంతర్గతపోరు తారస్థాయికి చేరింది. ఎవరైనా వింటే అసహ్యించుకుంటారనే ధ్యాస కూడా లేకుండా బుధవారం బాహాటంగా దూషణలకు దిగారు. 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన 'జీతం చాలదని సైడ్ బిజినెస్' అనే కథనంపై వైద్య శాఖలో తీవ్ర చర్చ సాగింది. ఈక్రమంలోనే విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ప్రభుత్వ వైద్యులు ఒకరిపై ఒకరు నెపాన్ని వేసుకునే ప్రయత్నం చేశారు. ఆ ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులు తెలిపిన మేరకు ...డ్రాయింట్ అధికారిగా ఉన్న శ్రీలక్ష్మి మరో వైద్యాధికారిణి మల్లేశ్వరికి మెమో జారీ చేశారు. మెమో కాపీని అక్కడున్న సీనియర్ అసిస్టెంట్ సోమశేఖర్‌కు ఇచ్చి, ఓపీకి హాజరు కాకుండానే వెళ్లిపోయారు. కొద్దిసేపటి తర్వాత ఓపీ సేవలకు వచ్చిన డాక్టర్ మల్లేశ్వరి మెమో కాపీని తీసుకుని చించేసి చెత్తబుట్టలో పారేశారు. నాకు మెమో ఇచ్చేంత స్థాయి శ్రీలక్ష్మికి ఎక్కడుందని ఆగ్రహంతో తిట్ల దండకాన్ని అందుకున్నారు. దీంతో అక్కడే ఉన్న వైద్య సిబ్బంది, రోగులు నివ్వెరపోయారు.పేదల వైద్యం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలతో ఆస్పత్రులు కట్టించి, వైద్యసేవలందించడానికి సిబ్బందిని నియమిస్తే వీరు చేసే పని ఇదా అంటూ పలువురు రోగులు పెదవి విరిచారు.

### శిక్షణను ఉపయోగించుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సీడాప్ ద్వారా స్వయం ఉపాధికి అందించే ఉచి త శిక్షణను ఉమ్మడి జిల్లాలోని మైనార్టీ నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని మైనార్టీ కార్పొరేషన్ ఈడీ సు బ్రహ్మణ్యం బుధవారం కోరారు. ఆసక్తి గల యువత ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో మైనార్టీ కార్పొరేషన్ కార్యాలయం లో దరఖాస్తులను అందజేయాలన్నారు. వివరాలకు 9849901138కు సంప్రదించాలన్నారు.

## 23న సాయిప్రుడెంట్ స్కాలర్‌షిప్ పరీక్ష

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన విద్యార్థులకు ఎంబీఏ కోర్సును ఉచితంగా అందించడమే లక్ష్యంగా ఈనెల 23న సాయిప్రుడెంట్ స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బాలకోటేశ్వరి తెలిపారు. ఈమేరకు అడ్మిషన్స్ డెరెక్టర్ ప్రశాంతితో కలిసి బీడుపల్లి సంస్కృతి స్కూల్ ఆఫ్ఇంజనీరింగ్‌లో పరీక్ష పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. జర్మనీలోని అనాహిత స్టిఫ్టుంగ్‌ఫౌండేషన్ వారు ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రెండేళ్ల ఎంబీఏ కోర్సుతో పాటు హాస్టల్ సదుపాయం పూర్తి ఉచితంగా అందిస్తామన్నారు. పరీక్ష ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. వివరాల కోసం అభ్యర్థులు సెల్ నంబర్లు 9100064545/9100974544/9100974537 ను సంప్రదించాలని సూచించారు.



పరీక్ష పోస్టర్‌ను విడుదల చేస్తున్న ప్రొఫెసర్ ప్రశాంతి

# ప్రాణం తీసిన ఆన్‌లైన్ జూదం

## రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య


అశోక్ (ఫైల్)

ధర్మవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ జూదం ఓ యువకుడి ప్రాణం తీసింది. హిందూపురం రైల్వే పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన మేరకు పట్టణంలోని సత్యసాయి నగర్‌కు చెందిన యనమల అశోక్(32) రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు. రెండు రోజుల కిందట ఇంటిని తనఖా పెట్టి బ్యాంక్‌లో రూ.8లక్షలు రుణం తీసుకున్నాడు. ఇందులో రూ.2లక్షలు అప్పు చెల్లించాడు. రూ.లక్ష భార్య ధరణి ఖాతాలో జమచేశాడు. మిగిలిన రూ.5లక్షలతో ఇటుకల బట్టీని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. అయితే ఆన్‌లైన్ జూదం అలవాటు ఉన్న అశోక్ రెండు రోజుల్లో మొత్తం సొమ్ము పోగొట్టుకున్నాడు. ఈ విషయం కుటుంబసభ్యులకు చెప్పుకోలేక తీవ్రంగా మథపడ్డాడు. ఈక్రమంలోనే మంగళవారం బ్యాంకులో బంగారు తాకట్టు పెట్టి డబ్బులు తెస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో భార్యకు ఫోన్‌చేసి రావడానికి లేటు అవుతుందని చెప్పాడు. సాయంత్రమైనా రాకపోవడంతో కుటుంబసభ్యులు ఫోన్ చేస్తే నాట్ రీచ్‌బుల్ అని వచ్చింది. దీంతో వారు ఆందోళనతో అతడిని వెతకడం ప్రారంభించారు. అయితే మంగళవారం రాత్రి అశోక్ తన ద్విచక్ర వాహనాన్ని కేతిరెడ్డికాలనీ సమీపంలోని ట్రాక్ వద్ద ఉంచి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. దీన్ని బుధవారం తెల్లవారు జామున గమనించిన రైల్వేకీమన్ హిందూపురం రైల్వే పోలీసులకు సమాచారం అందించాడు. వారు ఘటనా స్థలానికి చేరుకుని, పట్టాల సమీపంలో ఉన్న ద్విచక్రవాహనంలో ఉన్న ఆధారాలను బట్టి మృతుడు అశోక్ కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. దీంతో కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని గుర్తించి బోరున విలపించారు. అనంతరం అశోక్ భార్య ధరణి ఫిర్యాదు మేరకు హిందూపురం రైల్వే జమేదార్ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

# వృద్ధురాలిపై దాడి

## 12 తులాల బంగారం చోరీ


చికిత్స పొందుతున్న లక్ష్మమ్మ

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిపై దాడిచేసి 12 తులాల బంగారం చోరీ చేసిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం రాత్రి జరిగింది. బాధితురాలి బంధువులు తెలిపిన మేరకు.. పోలీస్ స్టేషన్ సమీపంలోని పాత పెట్రోల్ బంక్ వద్ద రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి లక్ష్మమ్మ ఒంటరిగా నివాసం ఉంటోంది. ఈ విషయం గుర్తించిన దుండగులు మంగళవారం రాత్రి ఇంటి తలుపు తట్టారు. ఆమె తలుపులు తీసిన వెంటనే దుండగుడు చేతిలో ఉన్న సుత్తితో తలపై కొట్టి, గుంతు నులిమాడు. దీంతో ఆమె స్పృహ కోల్పోయింది. ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల బంగారం చైన్ చేతులకు ఉన్న నాలుగు గాజులు(8 తులాలు) తీసుకుని ఉడాయించారు. కొద్దిసేపటి తరువాత స్పృహలోకి వచ్చిన ఆమె తన కుమార్తెకు ఫోన్ చేసి, విషయం చెప్పింది. కుమార్తె బంధువులతో అక్కడికి చేరుకుని గాయపడిన లక్ష్మమ్మను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. బాధితురాలు లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

# అహుడా వార్డు ప్లానింగ్ సెక్రటరీ ఆత్మహత్య

## అనుమానం ఉందంటూ తల్లి ఫిర్యాదు


నాగశ్రీ (ఫైల్)

అనంతపురం క్రైం, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): అహుడా వార్డు ప్లానింగ్ సెక్రటరీ నాగశ్రీ(32) ఈనెల 18న ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతిపై అనుమానం ఉందంటూ నాగశ్రీ తల్లి.. పోలీసులకు ఫిర్యాదు చేసింది. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక మారుతీనగర్ మొదటి క్రాస్‌కు చెందిన నాగశ్రీ, మూడో క్రాస్‌కు చెందిన ద్వారకేశ్ ఐదేళ్ల క్రితం ప్రేమించి, పెళ్లి చేసుకున్నారు. నాగశ్రీ నగరపాలక సంస్థలో ఉద్యోగం సంపాదించింది. కార్పొరేషన్ నుంచి అహుడా వార్డు ప్లానింగ్ రెగ్యులేషన్ సెక్రటరీగా రెండేళ్ల క్రితం డిప్యుటేషన్‌పై వచ్చి పని చేస్తుండేది. భర్త సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. వారికి మూడున్నరేళ్ల పాప సంతానం. మూడు రోజులుగా భర్తకు అనారోగ్యం అంటూ నాగశ్రీ సెలవు పెట్టింది. మంగళవారం విధులకు హాజరుకాలేదు. మధ్యాహ్నం సమయంలో బ్యాంకుకు వెళ్దామనీ, రెడీ కావాలని బయట పనిచూసుకుని వస్తానని నాగశ్రీకి భర్త చెప్పి వెళ్లాడు. తర్వాత కాసేపటికే తల్లి పద్మావతి.. ద్వారకేశ్‌కు ఫోన్ చేసి నాగశ్రీ ఉరి వేసుకుందని తెలిపింది. వెంటనే ఇంటికి చేరుకున్న అతడు.. తన తల్లిదండ్రులతో కలిసి తలుపులు బద్దలుకొట్టి గదిలోకి ప్రవేశించి, నాగశ్రీనికి కిందికి దించారు. ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆమె రాత్రి 10 గంటల సమయంలో మృతి చెందింది. దీనిపై అనుమానం ఉందంటూ నాగశ్రీ తల్లి శైలామణి ఫిర్యాదు చేసింది. కొన్ని రోజుల క్రితం వడిబియ్యం కార్యక్రమానికి తమ ఇంటికి కూతురిని పంపాలని కోరితే నిరాకరించారని ఫిర్యాదులో పేర్కొంది. ఆత్మహత్యపై నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రాణాలు పోతే.. మాకేంటి..?



## ఎన్టీఆర్ వైద్యసేవలో దోపిడీ

అదనంగా డబ్బులిస్తేనే వైద్యం

ఇవ్వకపోతే అడ్మిషన్, చికిత్సకు ససేమిరా

బరితెగిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులు

గాలిలో కలిసిపోతున్న పేదల ప్రాణాలు

మామూళ్ల మత్తులో యంత్రాంగం మౌనం

అనంతపురం టౌన్, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ పేరుతో ప్రభుత్వం ఉచిత వైద్యం అందిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం రూ.వేలకోట్ల బిల్లులు పెండింగ్ పెట్టిపోగా.. వాటిని కూడా కూటమి ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ పథకం ద్వారా రూ.25 లక్షలవరకు ఉచిత వైద్యసేవలు పొందేలా అవకాశం కల్పించింది. ప్రభుత్వ ఆశయానికి పలు ఆస్పత్రుల యాజమాన్యాలు తూట్లు పొడుస్తున్నాయన్నది బహిరంగ రహస్యమే. పేదల నుంచి దోపిడీ చేస్తూ వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతూ జేబులు నింపుకుంటున్నారు.


ఎన్టీఆర్ వైద్యసేవకు అదనపు వసూళ్లపై జిల్లా వైద్యాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ శ్రేణులు (ఫైల్)

అనంతపురం రూరల్ పరిధిలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో గత నెలలో ఓ పేషెంట్‌కు ఎన్టీఆర్ వైద్యసేవ అర్హత ఉన్నా.. అదనంగా డబ్బు డిమాండ్ చేశారు. వైద్యసేవ వర్తిస్తున్నపుడు అదనంగా ఎందుకివ్వాలని ప్రశ్నించగా.. చికిత్స చేయడానికి నిరాకరించారట. ఆ తర్వాత మరో ప్రైవేటు ఆస్పత్రిలో చేరి చికిత్స చేయించుకున్నారు. దీనిపై స్పందనలో కలెక్టర్ వినోద్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దానిపై స్పందన లేకపోవడంతో సీపీఐ శ్రేణులు.. బాధితులతో కలిసి జిల్లా వైద్యాధికారి కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు.

జిల్లా కేంద్రంలోని అరవిందనగర్‌లో గల కావేటి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి ప్రమాదంలో కాలు విరిగిన బ్రహ్మచారి అనే బాధితుడిని కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. ఎన్టీఆర్ వైద్యసేవ ఆమోదం రాలేదని ఆపరేషన్ చేయడంలో నిర్లక్ష్యం వహించారు. ఫలితంగా బ్రహ్మచారి మరణించాడు. అంతటితో ఆగకుండా ఆస్పత్రి ఫీజు పేరుతో రూ.13వేలు, ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు పేరుతో రూ4,500 తీసుకున్నారని బాధితుడి భార్య ఆరోపిస్తూ ఆస్పత్రి వద్ద పసిపాప, బంధువులతో కలిసి ఆందోళన చేపట్టారు.

సాయినగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో డెలివరీ కోసం వెళితే ముందుగా రూ.15 వేలు డబ్బు కట్టించుకున్నారని అనంతపురంరూరల్ మండలం పాపంపేటకు చెందిన ఓ వ్యక్తి తెలిపాడు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవ అమలవుతున్న ప్రతి ప్రైవేటు ఆస్పత్రిలో ఇలాగే పేదరోగుల నుంచి అదనంగా డబ్బు దండుకుని, జేబులు నింపుకుంటున్నారు.

### ఉచితం అంటూనే.. వసూళ్లు..


ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేస్తామని తన భర్తను చంపేశారంటూ కావేటి ఆస్పత్రి ముందు బైఠాయించిన కవిత, బంధువులు(ఫైల్)

ఎన్టీఆర్ వైద్యసేవ కింద ప్రతి ఒక్కరికి ఉచితంగానే వైద్యం అందించాల్సి ఉంటుంది. ఏవ్యాధికి ఎంత ఖర్చవుతుందో ప్రభుత్వం ముందుగానే నిర్ణయించి ఉంటుంది. చికిత్స అనంతరం బిల్లులు పెడితే నేరుగా ఆస్పత్రికి డబ్బు మంజూరు చేస్తుంది. జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో మాత్రం ఎన్టీఆర్ వైద్యసేవ కింద చేరిన రోగుల నుంచి అదనపు వసూళ్లకు తెగబడుతున్నారు. ఇదేమి న్యాయమని ప్రశ్నిస్తే 'ఆ వ్యాధికి తక్కువ ధరకు వైద్యం అందించలేమ'ని తెగేసి చెబుతున్నారు. ఇంకొన్ని ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులైతే వైద్యసేవ కింద ఉచిత వైద్యం అందించడం లేదని చెప్పి కర్కషంగా వ్యవహరించి, పంపించేస్తున్నారు. ఈనేపథ్యంలో కొందరు సీరియస్ వ్యాధి పీడితులు ప్రాణాలు కోల్పోతున్నారు.

### మౌనం ఎందుకో?

జిల్లాలో నిత్యం ఎన్టీఆర్ వైద్యసేవ కేసుల విషయంలో ఎక్కడో ఒకచోట వివాదాలు తలెత్తుతూనే ఉన్నాయి. అప్పుడు రోగులబంధువులు ఆందోళన చేస్తున్నారు. ఆ సమయంలో మాత్రం సంబంధిత వైద్యాధికారులు సీరియస్‌గా వెళ్లడం, చర్యలు తీసుకుంటామని ప్రగల్భాలు పలకడం, తిరిగి రావడం, తర్వాత మిన్నకుండిపోవడం రివాజుగా మారింది. రేషన్ కార్డులేనోళ్లు వస్తే వారిపేరున సీఎంసీసీ కార్డుకు సీఎం ఆఫీస్‌కు పెట్టుకుంటున్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా యంత్రాంగం సైతం దానిని అప్రూవ్ చేస్తోంది. వైద్యం విషయం కావడంతో సీఎంఓ వెంటనే స్పందించి, ఆ కార్డుకు ఆమోదం తెలుపుతోంది. ఈ కార్డు ముసుగులో కూడా పేషెంట్ల నుంచి డబ్బు గుంజుతున్నారు. ఈ వ్యవహారంలో ఆయా ఆస్పత్రుల నుంచి మామూళ్లరూపంలో డబ్బు ముడుతుండడంతోనే అధికారులు మౌనంగా ఉండిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకుని, పేదలకు ఉచితంగా వైద్యం అందేలా చూడాల్సిన అవసరం ఉంది.

### అదనంగా వసూలు చేస్తే చర్యలు



పేదలకు ఉచితంగా వైద్యం అందించాలనే ఎన్టీఆర్ వైద్యసేవను అమలు చేస్తున్నాం. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో రోగులకు ఉచితంగానే వైద్యం అందించాల్సి ఉంటుంది. అదనంగా డబ్బు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. ఇప్పటికే పలు ఆస్పత్రులపై విచారణ చేసి, బాధితులకు డబ్బు వాపసు ఇప్పించాం. ఆస్పత్రులపై జరిమానాలు సైతం విధించాం. కొన్నింటికి ఎన్టీఆర్ వైద్యసేవ అనుమతులు రద్దు చేశాం. డబ్బు వసూలుపై మా దృష్టికి తీసుకొస్తే ఆ ఆస్పత్రిపై చర్యలు తీసుకుంటాం.

-డాక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి,
ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్

# కార్పెంటర్ ఆత్మహత్యాయత్నం

● విద్యుత్ అధికారుల తీరుతో మనస్తాపం


విద్యుత్ అధికారుల ఎదుట పురుగుల మందు డబ్బాతో కార్పెంటర్ ఇషాక్‌వలి

కణేకల్లు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారుల తీరుతో మనస్థాపం చెందిన ఓ కార్పెంటర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలకేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుడైన ఇషాక్‌వలి కార్పెంటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కాగా అతడు నిర్వహిస్తున్న సామిల్లుకు గతేడాది ఏప్రిల్ 1వతేదీన విద్యుత్ అధికారులు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి మీటర్ బిగించారు. సిబ్బంది ప్రతినెలా రీడింగ్ చేయకుండా మూడునెలల బిల్లు రూ. 79,148ను ఒకేసారి చెల్లించాలని జూలై 5వ తేదీన ఇషాక్‌వలికి అందజేశారు. ఇందుకు ఆందోళన చెందిన అతను అంతబిల్లు తాను చెల్లించలేనని, కాస్తా తగ్గించాలని అప్పటినుంచి విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. వారు ఒప్పుకోలేదు. నేరుగా ఎస్ఈని కూడా కలిసి విన్నవించాడు. పలుసార్లు గ్రీవెన్స్‌లో అర్జీలను అందించాడు. ఎవరూ అంగీకరించలేదు. కాగా బుధవారం ఉరవకొండ ఏడీఏ భాస్కర్, ఏఈ శంకర్ నాయక్ అతడి సామిల్లుకు వెళ్లి బిల్లు ఎలాగైనా కట్టాలని సూచించారు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన ఇషాక్‌వలి కొద్దిసేపటి అనంతరం విద్యుత్ కార్యాలయానికి వెళ్లి మూడునెలలకే ఇంత బిల్లు వస్తుందా అని ఆ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. తన దుకాణంలో అంత విద్యుత్ వాడకం లేదని తెలిపాడు. అయినా అధికారులు వినకపోవడంతో మనస్తాపం చెందిన అతను వెంట తెచ్చుకున్న పురుగుల మందును తాగేందుకు ప్రయత్నించాడు. వెంటనే అధికారులు అడ్డుకుని మరో రెండురోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని, ఆందోళన చెందవద్దని చెప్పారు. దీంతో ఇషాక్‌వలి వెనుదిరిగాడు.

## 2.58 లక్షల మందికి పీఎం కిసాన్ సొమ్ము విడుదల

కొత్తచెరువు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లాలో 2.58 లక్షల మంది రైతులకు 19వ విడత పీఎం కిసాన్ సొమ్ము రూ.51.51 కోట్లు కేంద్రప్రభుత్వం విడుదల చేసింది. ఆ సొమ్మును ఈనెల 24న ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా జమ చేస్తారని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు బుధవారం ప్రకటనలో తెలిపారు.

### 2.85 లక్షల మందికి..

అనంతపురం అర్బన్: అనంత జిల్లాలోని 2.85 లక్షల మంది రైతులకు రూ.57.02 కోట్లు పీఎం కిసాన్ సొమ్మును ఈనెల 24 ప్రధాని జమ చేస్తారని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ ప్రకటనలో తెలిపారు.

# స్టాంప్ బ్లాక్

(5వ పేజీ తరువాయి)

సృష్టిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పలు ప్రాంతాలలో బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

### నాలుగు రెట్ల ధర..

గుత్తి పట్టణంలో నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్ల కొరత తీవ్రమైంది. ఇదే అదనుగా రూ.100 విలువైన స్టాంప్‌ను రూ.400కు అమ్ముతున్నారు. విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదు. గుత్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో 14 మంది స్టాంప్ వెండర్లు ఉన్నారు. వీరు ఇండెంట్ పెట్టి స్టాంప్ పేపర్లు కొనుగోలు చేస్తుంటారు. వీటి విలువ ఆధారంగా ప్రభుత్వం కమీషన్ చెల్లిస్తుంది. వీటిని నిర్దేశించిన ధరలకు విక్రయించాలి. కొరతను అనువుగా మార్చుకుని దందాకు తెరలేపారు. ప్లాట్లు, భూముల రిజిస్ట్రేషన్ అత్యవసరంగా చేసుకునేవారు ఎంత ధర ఇచ్చేందుకైనా వెనుకాడటం లేదు. స్టాంప్‌ల కొరత ఉన్నప్పటికీ స్టాక్ వచ్చినప్పుడు తమకు అనుకూలంగా ఉన్న స్టాంప్ వెండర్లకే అధికంగా కేటాయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు వారితో లాలుచీ పడుతున్నారని ప్రచారం జరుగుతోంది. అధిక ధరల గురించి ప్రశ్నిస్తే స్టాంప్ పేపర్లు లేవని చెబుతున్నారు. దీంతో గత్యంతరం లేక అడిగినంత ఇస్తున్నామని బాధితులు అంటున్నారు.

### ఈ-స్టాంపింగ్ లేక..

మడకశిర నియోజకవర్గంలో రూ.100, రూ.50 స్టాంపులు దొరకడం లేదు. దళారులను ఆశ్రయిస్తే తప్ప పని జరగడం లేదు. వారివద్ద లభించకపోతే రూ.10 స్టాంపు కావాలన్నా 50 నుంచి 100 కి.మీ. దూరం వెళ్లి తెచ్చుకోవాల్సిందే. నాలుగు నెలల నుంచి ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మడకశిరలో పది మందికిపైగా లైసెన్స్ హోల్డర్లు ఉన్నారు. వీరిలో ఒకరికి మాత్రమే స్టాక్ హోల్డింగ్ సంస్థ ఈ-స్టాంపింగ్‌ను అప్పగించింది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మడకశిర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో రోజుకు 25 నుంచి 35 రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. క్రయ విక్రయదారులు స్టాంపుల కోసం హిందూపురం, అనంతపురం తదితర ప్రాంతాలకు వెళుతున్నారు. అఫిడవిట్‌ల కోసం రూ.10, రూ.20 స్టాంపులు కావాలన్నా దొరకడం లేదు. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ-స్టాంపింగ్ కోసం కర్నూలుకు వెళ్లి విన్నవించినా స్పందనలేదని స్థానిక వెండర్లు వాపోతున్నారు.

### దొరకడం లేదు..



రెండు మూడు నెలలుగా స్టాంపుల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఈ-స్టాంపింగ్ అందుబాటులో లేవు. నాన్ జ్యుడీషియల్ స్టాంపులు లేవు. రూ.50, రూ.100 స్టాంపులు కావాలంటే హిందూపురం, అనంతపురం వెళ్లాల్సిందే. వైసీపీ ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయాలే దీనికి కారణం. ప్రభుత్వం మారడంతో సమస్య పరిష్కారమవుతుంది అనుకున్నాం. కానీ ఫలితం కనిపించడం లేదు. అధికారులు చొరవ చూపాలి.

-మంజునాథ్, గౌడనహళ్లి

### రిజిస్ట్రేషన్ వాయిదా వేసుకున్నాం..



స్టాంపుల కొరత వల్ల రిజిస్ట్రేషన్ వాయిదా వేసుకున్నాం. హిందూపురం, అనంతపురం తదితర ప్రాంతాలకు వెళ్లి క్యూలైన్లో నిలబడినా దొరకడం లేదు. ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నా కొరత ఏమిటో అర్థం కావడం లేదు. -మంజు, జక్కేపల్లి

### నియంత్రించాలి..



గుత్తి పట్టణంలో కొందరు స్టాంప్ వెండర్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. రూ.100 స్టాంప్‌ను రూ.500కు అమ్ముతున్నారు. రూ.50 స్టాంప్‌ను రూ.300కు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విక్రయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- రంగరాజు, గుత్తి

### ఇబ్బంది పడుతున్నాం..



గుత్తి పట్టణంలో నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌లు లేవు. రిజిస్ట్రేషన్ కోసం ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి వెంటనే స్టాంప్‌లను అందుబాటులో ఉంచాలి.

- ఖాదర్, గుత్తి

## టమోటా కిలో రూ.10



అనంతపురంరూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.10తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. బుధవారం మార్కెట్‌కు 300 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయని పేర్కొన్నారు. కిలో సరాసరి ధర రూ.9, కనిష్ఠ ధర రూ.7పలికినట్లు ఆయన తెలిపారు.

## చీనీ కాయలు టన్ను రూ.23 వేలు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.23,390, కనిష్ఠంగా రూ.5,500, సరాసరి రూ.12వేలతో అమ్ముడు పోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 71 టన్నుల చీనీ కాయలు వచ్చాయని పేర్కొన్నారు.

# క్షేత్రస్థాయికి వెళ్లండి..

ప్రతిగర్భిణి రికార్డుల్లో నమోదు కావాలి

తల్లీబిడ్డకు పక్కాగా వైద్యసేవలు అందాలి

మాతాశిశు మరణాలకు మీదే బాధ్యత

వైద్యుల సమీక్షలో ఏడీ అనిల్‌కుమార్


ప్రోగ్రాం అధికారులతో సమీక్షిస్తున్న ఏడీ అనిల్‌కుమార్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రోగ్రాం అధికారులు ఆఫీసుల్లో కూర్చోకుండా క్షేత్రస్థాయికి వెళ్లాలనీ, వైద్య పథకాలు, సేవలు ప్రజలకు ఎలా అందుతున్నాయో పరిశీలించాలని వైద్యశాఖ అదనపు సంచాలకుడు (ఏడీ) డాక్టరు అనిల్‌కుమార్ ఆదేశించారు. ఆయన రెండురోజులుగా జిల్లాలో పలు పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. బుధవారం సాయంత్రం స్థానిక జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ప్రోగ్రాం ఆఫీసర్లతో సమావేశమయ్యారు. తల్లీబిడ్డ సంక్షేమానికి ఎన్నో పథకాలున్నా.. నేటికీ మాతాశిశు మరణాలు సంభవిస్తుండడం ఏంటని ప్రశ్నించారు. ప్రతి గర్భిణిని రికార్డుల్లో నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి వారం, ప్రతినెలా వారికి అవసరమైన వైద్యసేవలు, పరీక్షలు చేయించాల్సిన బాధ్యత ప్రోగ్రాం అధికారులపై ఉందన్నారు. హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తల్లీబిడ్డల మరణాలకు కారకులవుతున్నారని మండిపడ్డారు. ఇందుకు సాకులు చెబితే ఒప్పుకునేది లేదనీ, సంబంధిత వైద్యాధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి ఈబీ దేవి, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ యుగంధర్, డాక్టర్ అనుపమజేమ్స్, డాక్టర్ రవిశంకర్, ఎస్ఓ మహమ్మద్ రఫీ, ఎన్‌హెచ్ఎం కిషోర్, డెమోలు త్యాగరాజు, గంగాధర్ పాల్గొన్నారు.



# ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

ఉరవకొండ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని లత్తవరం తండాలో ఇంటర్ విద్యార్థిని కావ్య(16) ఆత్మహత్యకు పాల్పడింది. ఈశ్వర్‌నాయక్, జానకీబాయి దంపతుల కుమార్తె అయిన కావ్య ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. కాగా బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొద్దిసేపటికి కుటుంబసభ్యులు వచ్చి చూసి కిందకు దించి పరిశీలించగా.. అప్పటికే మృతి చెందింది. సమాచారం అందుకున్న సీఐ మహానంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

# గంజాయి స్వాధీనం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆలూరు రోడ్డులో గల గులాంషా ఖాద్రీ దర్గా ఆర్చి వద్ద బుధవారం ముగ్గురు గంజాయి విక్రేతలను అరెస్టు చేసి వారి నుంచి 11వందల గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు. గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. తర్వాత వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. పట్టణానికి చెందిన షికారి నాగ అలియాస్ నాగులు, అశోక్‌కుమార్, తాడిపత్రికి చెందిన అల్తాఫ్ ఒరిస్సా రాష్ట్రం భువనేశ్వర్ రైల్వే స్టేషన్‌లో గంజాయిని కొనుగోలు చేసి గుంతకల్లుకు తీసుకొచ్చి.. ఇక్కడ చిన్న ప్యాకెట్‌లలో వేసి విక్రయాలు జరుపుతూ పట్టుబడ్డారని సీఐ వివరించారు.

# రోజూ లక్ష పని దినాలు నమోదు చేయాలి

## అడిగిన ప్రతి కూలీకీ పని కల్పించాలి : సీఆర్డీ కృష్ణతేజ


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డ్వామా పీడీ, ఏపీడీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పని అడిగిన ప్రతి కూలీకీ కల్పించాలనీ, రోజూ జిల్లా నుంచి కనీసం లక్ష పనిదినాలు నమోదు చేయాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ (సీఆర్డీ) కృష్ణతేజ ఆదేశించారు. అమరావతి నుంచి బుధవారం ఉపాధి పథకంపై సీఆర్డీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఆర్డీ కృష్ణతేజ మాట్లాడుతూ.. రోజువారీ కూలీల సంఖ్య పెంచాలనీ, కనీస వేతనం అందేలా చూడాలని ఆదేశించారు. వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాల సంఖ్య పెంచాలన్నారు. కరువుమండలాల్లో అదనంగా 50 రోజులు పని దినాలు కల్పించి, నీటికుంటల నిర్మాణాలు చేపట్టాలన్నారు. నీటికుంట నిర్మించుకున్న రైతుకు 10 రకాల పండ్లమొక్కలు, కాయగూరల కిట్లు ఉచితంగా అందజేయాలన్నారు. ఉపాధి సీజన్ ప్రారంభమైనందున లక్ష్యాలను అధిగమించాలని ఆయన ఆదేశించారు. స్థానిక డ్వామా కార్యాలయం నుంచి పీడీ సలీంబాషా, ఏపీడీలు రమేష్‌నాయక్, అయేషా, విజయ్‌కుమార్, చెన్నకేశవయ్య, కృష్ణచైతన్య వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

# ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు సర్వర్ కష్టాలు

● ఓటీపీ నమోదులో సమస్యలు ● గంటల కొద్దీ రైతుల పడిగాపులు

రాప్తాడు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఆధార్ తరహాలో రైతులకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు నంబర్ అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదుకు సర్వర్ సతాయిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు, ఈ క్రాప్ బుకింగ్, పంట నష్టపరిహారం, వాతావరణ బీమా, పంట కొనుగోలు, పీఎం కిసాన్, పంట రుణాలు, సబ్సిడీ వ్యవసాయ పరికరాలు, ఇతర పథకాలు పొందాలంటే రైతులకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ నంబర్ ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. భూమి కలిగిన రైతులు ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, సెల్ ఫోన్ నెంబర్ వివరాలతో రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపడుతోంది. రైతులు సేవా కేంద్రాలకు వెళ్లినప్పుడు సాంకేతిక కారణాల వలన సర్వర్ మొరాయిస్తోంది. దీంతో రైతులు గంటల కొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కావాలంటే మూడుసార్లు ఓటీపీ నంబర్ రావాల్సి ఉంటుంది. రెండుసార్లు మాత్రమే ఓటీపీ నంబర్లు వస్తున్నాయి. మూడోసారి ఓటీపీ నమోదు చేసే సమయంలో సాంకేతిక కారణాల వల్ల సర్వర్ సతాయిస్తోంది. దీంతో రైతు సేవా కేంద్రం సిబ్బంది


రిజిస్ట్రేషన్ కోసం రాప్తాడు రైతు సేవా కేంద్రంలో వేచి ఉన్న రైతులు

రైతుల ఆధార్, మొబైల్ నంబర్, భూమి వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేసుకుని ఇంటికి పంపుతున్నారు. సర్వర్ సతాయిస్తుండటంతో రైతులు కూర్చునేందుకు కొన్ని కుర్చీలు ఏర్పాటు చేశారు. సర్వర్ సమస్యను ఉన్నతాధికారులకు తెలిపినట్లు రైతు సేవా కేంద్రం సిబ్బంది చెబుతున్నారు.

# మోడల్ స్కూల్ విద్యార్థినులకు అస్వస్థత

కనగానపల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మోడల్‌స్కూల్ విద్యార్థినులు అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. కనగానపల్లి మోడల్‌స్కూల్ హాస్టల్‌లో మంగళవారం రాత్రి 20మంది విద్యార్థినులు ఉన్నపళంగా కడుపునొప్పి, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే హాస్టల్ సిబ్బంది కనగానపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చికిత్సలు అందించారు. కొంతమంది విద్యార్థులను తల్లిదండ్రులకు సమాచారం అందించి వారి వెంట పంపారు. నలుగురు విద్యార్థినులను అడ్మిట్ చేసి చికిత్సలు అందించారు. విషయం తెలుసుకున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత బుధవారం కనగానపల్లి ఆసుపత్రికి వచ్చి విద్యార్థినులను పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని అధికారులకు సూచించారు. ఫుడ్‌పాయిజన్‌తో అస్వస్థతకు గురయ్యారని అధికారులు తెలిపారు. మంగళవా రం ప్రాక్టికల్స్ పరీక్షలకు ధర్మవరం వెళ్లిన విద్యార్థినులు అక్కడ ఫాస్ట్‌ఫుడ్ తినడంతో అనారోగ్యానికి గురయ్యారని వివరించారు. అనంతరం హాస్టల్‌ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే అక్కడ నెలకొన్న అపరిశుభ్రతపై


విద్యార్థినిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అసహనం వ్యక్తం చేశారు. రెం డురోజుల్లో పరిస్థితి మారాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని ఎంఈఓ అరుణమ్మ, ప్రిన్సిపాల్ రవికిరణ్‌ను ఆదేశించారు.

# భూసమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి : కలెక్టర్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూసమస్యల పరిష్కారంపై ప్రతి రెవెన్యూ అధికారి, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జేసీ, డీఆర్‌ఓ, ఆర్డీఓలు, తహసీల్దార్లు, డీటీలతో ఆయన కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూసమస్యలు పెండింగ్‌తో రైతులకు క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. దీనివల్ల ఆ రైతులు ప్రతి ఒక్కరి వద్దకు వెళ్లి న్యాయం చేయాలని వినతులు ఇవ్వాల్సి వస్తోందన్నారు. ఈ ప్రభావం రెవెన్యూ యంత్రాంగంపై పడుతోందన్నారు. రెవెన్యూ సదస్సులకు సంబంధించి జిల్లాలో 4,810 అర్జీలు వచ్చాయని, ఇందులో 3,997 అర్జీలు పరిష్కరించామని, మిగిలినవాటిని త్వరగా పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఎవరు, ఎక్కడ నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

**క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసిన కలెక్టర్**

ఆత్మకూరు : రెవెన్యూ సదస్సులో ఇచ్చిన అర్జీని కలెక్టర్ వినోద్‌కుమార్ మండలంలోని మదిగుబ్బ గ్రామంలో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గత డిసెంబరులో మదిగుబ్బ జరిగిన రెవెన్యూ సదస్సులో జింకల నరసింహులు


రస్తా అర్జీని క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

సర్వేనంబరు 120-1లో 6.50 ఎకరాల తన భూమికి రస్తా లేదని అర్జీ ఇచ్చాడు. బుధవారం కలెక్టర్ వినోద్‌కుమార్ అక్కడికి వచ్చి రస్తా వివాదంపై సమగ్రంగా వివరాలు ఆరా తీశారు. ప్లాన్ మార్క్ ప్రకారం రస్తా చూపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# ఎంపీఈఓల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావిస్తా: విప్


కాలవ శ్రీనివాసులును సన్మానిస్తున్న ఎంపీఈఓల సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఎంపీఈఓలకు మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేయడంపై అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. బుధవారం రాయదుర్గంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, నాయకులు రమేష్, మనోహర్‌నాయుడు ప్రభుత్వ విప్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది చేసే పనులే తాము చేస్తున్నామని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఇందుకు ప్రభుత్వ విప్ స్పందిస్తూ... త్వరలో జరిగే అసెంబ్లీలో ఎంపీఈఓలకు మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేయడంపై ప్రస్తావించి, న్యాయం జరిగేలా చూస్తా అన్నారు. ఆ తర్వాత అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు ఎంపీఈఓల సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, రవి, అశోక్, కుమార్, మహాలక్ష్మీ, జ్యోతి, శిరీష, ఉమాదేవి, అశ్వని, నారాయణమ్మ, అరుణ పాల్గొన్నారు.

## కందుల నగదు జమ చేయండి


కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతుల నుంచి కొనుగోలు చేసిన కందులకు వెంటనే నగదును ఖాతాల్లోకి జమ చేయించాలని కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఏపీ రైతు సంఘం నాయకులు విన్నవించారు. బుధవారం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, నాయకులు చిన్నప్ప, రామక్రిష్ణ, మధు, శ్రీకాంత్ తదితరులు కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం కొన్న కందులకు సకాలంలో నగదు జమకావడంలేదని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. స్పందించిన కలెక్టర్.. మార్క్‌ఫెడ్ అధికారులతో మాట్లాడారు. కొనుగోలు చేసిన కందులకు నగదును ఎందుకు జమచేయలేదని ప్రశ్నించారు. వెంటనే రైతుల ఖాతాల్లోకి ఆ సొమ్మును వేయించాలని ఆదేశించారు.

## ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌తో ప్రయోజనాలు : ఏడీ

శింగనమల ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ్ రిజిస్ట్రేషన్ గుర్తింపు కార్డుతో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వ్యాపారులకు భవిష్యత్‌లో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా పరిశ్రమ శాఖ ఏడీ రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పెద్ద జలాలపురంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. పరిశ్రమలు పెట్టాలనుకున్న ఔత్సాహికులు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి గుర్తింపు కార్డు ఇస్తామని, భవిష్యత్‌లో బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి ఇవి ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐపీఓలు రవీంద్రనాథ్‌రెడ్డి, భువనేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ చలపతి పాలొన్నారు.

## పశు సంచార వాహనాలను నిలిపివేయడం తగదు


జేడీకి వినతి పత్రం ఇస్తున్న పశు సంచార వాహనాల డాక్టర్లు, సిబ్బంది

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పశు సంచార వాహనాలను అర్ధంతరంగా నిలిపివేయడం అన్యాయమని పశుసంచార వాహనాల డాక్టర్లు, సిబ్బంది పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి ఎదుట ఆవేదన చెందారు. ఈ మేరకు బుధవారం జేడీకి పశుసంచార వాహనాల డాక్టర్లు హైమావతి, శృతి, మంజుశ్రీ, పైలెట్స్ సుభానీ, షరీప్, పవన్‌సాయి, పారావెట్స్ వినోద్‌కుమార్, అఫ్రీద్, మహ్మద్, అకాష్ వినతి పత్రం అందజేశారు. జిల్లాలో 14 సంచార వాహనాలు ఉండగా.. ఈ నెల 16వతేదీ నుంచి 7 వాహనాలను నిలిపివేశారన్నారు. తమకు ఎలాంటి సమాచారం లేకుండా ఉన్నట్లుండి వాహనాలను నిలిపివేశారన్నారు. తిరిగి సంచార వాహనాలు ఎప్పుడు ప్రారంభిస్తారు..? తమను తిరిగి విధుల్లోకి తీసుకుంటారా..? లేదోనన్న సమాచారం కూడా ఇవ్వలేదన్నారు. ఉన్నట్టుండి వాహనాలు బంద్ చేయడంతో తాము రోడ్డుపై పడ్డామన్నారు. తమకు తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## బ్యాంకు పథకాలను సద్వినియోగం చేసుకోండి

రాప్తాడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులు ప్రజలకు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాప్తాడు కెనరా బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ వెంకట సుబ్బయ్య తెలిపారు. కెనరా బ్యాంకు ఉద్యోగులు బుధవారం రాప్తాడులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రాప్తాడు గ్రామంలోని వీధుల్లో, ప్రభుత్వ కార్యాలయాల వద్ద పథకాలపై ప్లకార్డులతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ వెంకటక్రిష్ణ, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

## సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల వెల్లువ

- నేటి నుంచి ఇంటర్వ్యూలు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): సబ్సిడీ రుణాలకు భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. మండల వ్యాప్తంగా 700కు పైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు అంటున్నారు. గత ప్రభుత్వం సబ్సిడీ రుణాలను పూర్తిగా పక్కనపెట్టేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తిరిగి ప్రవేశ పెట్టింది. ఈ క్రమంలో పెద్ద ఎత్తున రుణాలకు దరఖాస్తులు చేసుకున్నారు. రూరల్ మండల పరిధిలోని 25 పంచాయతీలకు కులాల వారిగా యూనిట్లు మంజూరయ్యాయి. బీసీలకు 41 యూనిట్లు, కాపులకు(బలిజ) 8, ఈబీసీలకు 4, రెడ్డి కులస్థులకు 1, కమ్మ కులస్థులకు 5, బ్రాహ్మణులు, ఆర్యవైశ్యులకు ఒక్కొక్కటి చొప్పున యూనిట్లు మంజూరయ్యాయి. వీటితోపాటు జనరిక్ మందుల షాపులకు బీసీ, ఈబీసీ, రెడ్డి, కమ్మ కులస్థులకు ఒక్కొక్కటి చొప్పున మంజూరయ్యాయి. అన్నీ కలిపి 70యూనిట్ల వరకు మంజూరయ్యాయి. దరఖాస్తులు భారీగా వచ్చాయి. గురువారం నుంచి రెండు రోజుల పాటు సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఉదయం 10:30 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటనాయుడు తెలిపారు. దరఖాస్తుదారులు దరఖాస్తు ఫారంతోపాటు అప్లికేషన్‌కు జతచేసిన సర్టిఫికెట్లను తీసుకోవాలని సూచించారు.


ఎంపీడీఓ కార్యాలయం

## న్యూస్ బాక్స్

### పాఠశాలకు టేబుల్స్ వితరణ


టేబుల్స్ అందజేసిన వారితో ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహిస్తున్న పోలీస్ రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూల్‌కు ఆర్డీటీ, భవిష్య ఇరిగేషన్స్ దాతల సహకారంతో రూ.1.40 లక్షల విలువైన టేబుల్స్ అందజేశారు. ఎస్పీ జగదీష్, ఆర్డీటీ మహిళా సాధికారత విభాగం డైరెక్టర్ విశాల ఫెర్రర్ బుధవారం పోలీస్ రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూలును సందర్శించారు. పిల్లలతో కాసేపు ముచ్చటించారు. టేబుల్స్ అందజేసిన ఆర్డీటీని, భవిష్య ఇరిగేషన్స్ యజమాని చల్లా శ్రీనివాసులును ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాసరావు, నీలకంఠేశ్వర్‌రెడ్డి, సీఐలు క్రాంతికుమార్, ధరణికిషోర్, విశ్వనాథచౌదరి, ఆర్ఐ మధు, ఆర్డీటీ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, జిల్లా పోలీస్ అధికారుల సంఘం సాకే త్రిలోక్‌నాథ్ పాల్గొన్నారు.

### సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిచెర్లలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి విద్యుత్, రెవెన్యూ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. బుధవారం విద్యుత్ శాఖ కన్‌స్ట్రక్షన్ ఈఈ మోహనమ్మ, డీఈఈ రఘు, ఏఈఈ సోమశేఖర్, తహసీల్దార్ హరికుమార్ స్థలాన్ని పరిశీలించారు. గ్రామ సమీపంలో గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఆ లేఅవుట్‌లో ఉన్న ఓపెన్ సైట్ నందు సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు.

### జాగరణ మహోత్సవాన్ని జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈనెల 26న జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణమండపంలో టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాగరణ మహోత్సవంలో భక్తులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని పరిషత్ సభ్యుడు శ్రీపాద వేణు పిలుపునిచ్చారు. బుధవారం దత్త అవతార మాణిక్య ప్రభు శిష్యుడు రాఘవేంద్ర మాణిక్య ప్రభును శ్రీపాద వేణు కలిసి మహోత్సవానికి ఆహ్వానించారు. రామవేంద్ర మాణిక్య ప్రభు చేతులమీదుగా జాగరణ మహోత్సవ బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాగలింగారెడ్డి, సతీష్, వెంకటాద్రి నాయుడు, ధనుంజయ్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

### 22, 23 తేదీల్లో హజ్ యాత్రికులకు శిక్షణ

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఈ యేడాది హజ్ యాత్ర చేపట్టే యాత్రికులకు ఈనెల 22, 23వ తేదీల్లో నగరంలోని పీటీసీ ఎదురుగా ఉన్న చాందిని మసీదులో శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు హాజీ ఖాదీమ్ మహమ్మద్ రఫీ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు హజ్ యాత్ర, విధివిధానాలపై శిక్షణ ఇస్తామన్నారు. 9440983090, 8688526178 నెంబర్లను సంప్రదించి నమోదు చేసుకోవాలన్నారు.

### విద్యారంగ సమస్యలను పరిష్కరించండి

శింగనమల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని శింగనమల ఎమ్మెల్యే శ్రావణిశ్రీని ఎస్ఎఫ్ఐ నాయకులు సూర్యప్రకాశ్, గిరి తదితరులు వినతి పత్రం అందజేశారు. బుధవారం అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆమెకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎక్కడా డిగ్రీ కళాశాల లేదని, శింగనమలలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సోము, నాగభూషణ్, సాయికృష్ణ, రాకేష్ తదితరులు పాలొన్నారు.

### చికిత్స పొందుతూ టీడీపీ కార్యకర్త మృతి

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గార్లదిన్నె భాస్కర్ (39)ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందారు. భాస్కర్ మంగళవారం తన ఇంటి మెట్లు ఎక్కుతుండగా జారి కిందపడ్డారు. తలకు తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి అనంతపురం తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందినట్లు స్థానిక టీడీపీ నాయకులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, నాయకులు పెద్ద వెంకటరాముడు, లక్ష్మయ్య, జగదీశ్, పక్కీరప్ప, వెంకటేశ్, రాము తదితరులు భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

### పాఠశాలలో సరస్వతీ హోమం


హోమం చేస్తున్న కరస్పాండెంట్

అనంతపురం విద్య, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మినర్వా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పదో విద్యార్థుల కోసం బుధవారం సరస్వతీ హోమం నిర్వహించారు. కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు, టీచర్ల నడుమ వేద పండితులు సరస్వతీ హోం నిర్వహించారు. తర్వాత విద్యార్థులకు తీర్థప్రసాదాలు అందించి, భోజన కార్యక్రమం నిర్వహించారు.

### ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

నార్పల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గంగావతి బుధవారం ఒక ప్రకటనతో తెలిపారు. మండలంలోని గ్రామ సచివాలయం-2లో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 20, 21, 24,28 తేదీల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

### వీఆర్వోలుగా నియమించండి

శింగనమల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): వీఆర్ఏ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి వీఆర్వోలుగా నియమించాలని మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్‌కు ఆ సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. బుధవారం అనంతపురం వచ్చిన ఆయనను వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు ఓబిలేసు ఆధ్వర్యంలో కలసి తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వీఆర్ఏ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారు రెండు వేల మంది ఉన్నారని వీఆర్వోలుగా నియమించాలని కోరారు.


మాల కార్పొరేషన్ చైర్మన్‌ను కలసిన వీఆర్ఏ సంఘం నాయకులు

## హంద్రీనీవా పనులను అడ్డుకున్న రైతులు

లైనింగ్‌తో భూగర్భ జలాలు అడుగంటుతాయని ఆందోళన


తగరకుంట వద్ద కాలువ పనులను అడ్డుకుంటున్న రైతులు

కనగానపల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తగరకుంట వద్ద జరుగుతున్న హంద్రీనీవా కాలువ పనులను స్థానిక రైతులు బుధవారం అడ్డుకున్నారు. రాయలసీమలోని చివరి ప్రాంతాల రైతులకు హంద్రీనీవా జలాలను అందించాలని ప్రభుత్వం కాలువ పనులకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా కాలువలో పూడికతీత పనులు చేపడుతున్నారు. లైనింగ్ పనులు చేపడితే నష్టపోతామని భావించిన తగరకుంట, పాతపాళ్యం సర్పంచులు మాధవరాజు, రాజాక్రిష్ణ, నాగేంద్ర, ఎర్రిస్వామి తదితరులు రైతులతో కలిసి పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాధవరాజు కాంట్రాక్టర్లతో ఫోన్‌లో మాట్లాడుతూ.. జంగిల్ క్లీనింగ్ పనులకు తాము అడ్డుకాదని, లైనింగ్ పనులను వ్యతిరేకమని తెలిపారు. ఎమ్మెల్యే పరిటాల సునీతకు రైతుల అభ్యంతరాలను తెలుపుతామని, అప్పటి వరకూ పనులు ఆపాలన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన అవసరం : ఏఎస్పీ


మాట్లాడుతున్న ఏఎస్పీ రమణమూర్తి

అనంతపురం క్రైం 19 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలని రోధించాలంటే అవగాహన అవసరమని జిల్లా అదనపు ఎస్పీ రమణమూర్తి అన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల్లో సైబర్ నేరాల పట్ల అవగాహన చేయడం అవసరమని భావించి స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ సెల్ సీఐ జాకీర్‌తో కలిసి ఏఎస్పీ రమణమూర్తి పలు సూచనలు చేశారు. రిటైర్డ్ ఉద్యోగులు కావడం వలన అకౌంట్లలో తప్పనిసరిగా డబ్బు ఉంటుందని గుర్తించి సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేసే అవకాశముంటుందని గుర్తుంచుకోవాలన్నారు. అపరిచితుల కాల్స్‌కు, మెయిల్స్ మెసేజిలకు స్పందించకుండా ఉండాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, రిటైర్డ్ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంఘం, రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## అహుడాకు సంపూర్ణ సహకారం: కలెక్టర్


కలెక్టర్‌కు ప్రతిపాదనలను అందజేస్తున్న అహుడా చైర్మన్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అహుడా అభివృద్ధికి తమ సంపూర్ణ సహకారం ఉంటుందని కలెక్టర్ వినోద్‌కుమార్ హామీ ఇచ్చారు. బుధవారం కలెక్టర్‌ను అహుడా చైర్మన్ టీసీ వరుణ్ మర్యాదపూర్వకంగా కలిసి అహుడా అభివృద్ధి కోసం రూపొందించిన ప్రతిపాదనలను అందజేశారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ... పట్టణీకరణ విషయంలో, ముఖ్యంగా పౌరుల భూభద్రత సంరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలపై అభినందించినట్లు టీసీ వరుణ్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో డిజిటలైజేషన్ ద్వారా పౌరులకు భూ హక్కు సంరక్షణ కల్పించేందుకు అవలంభిస్తున్న తీరుపై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు.

## రాజకీయ ప్రమేయం లేకుండా రుణాలివ్వాలి

నార్పల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా బీసీ సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని ఎంపీడీఓ గంగావతికి బుధవారం సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి సాకే నాగరాజు మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా బీసీ జనాభా ఎక్కువగా ఉన్నందున సబ్సిడీ రుణా లు 30 యూనిట్ల నుంచి 60 యూనిట్లకు పెంచాలన్నారు. రు ణాల మం జూరులో రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా అర్హులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పెద్దపెద్దయ్య, నారాయణప్ప, నారాయణ, అల్తాఫ్, సూరి, చంద్ర పాల్గొన్నారు.

## జిల్లా హాకీ బాలుర జట్టు ఎంపిక


ఎంపికైన జిల్లా హాకీ బాలుర జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జిల్లా హాకీ బాలుర జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన జట్టు వివరాలను హాకీ అనంతపురం జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ బుధవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ప్రకటించారు. జట్టులో గంగాధర్, నల్లప్పరెడ్డి, అక్రంభాషా, కుళ్ళాయప్ప, సంతోష్‌కుమార్, చంద్రమౌళి, వెంకటేష్, జస్వంత్, మహేష్, అరవింద్, శివారెడ్డి, అనీల్‌కుమార్, దేవా, మంజు, ఎర్రిస్వామి, గోవర్ధన్, మధులు ఎంపిక కాగా స్టాండ్‌బైలుగా సాయికిరణ్, శివా, రెడ్డి, సురేష్ ఉన్నారు. ఎంపికైన జట్టు గుంటూరులోని నాగార్జున యూనివర్శిటీలో మార్చి 6, 7, 8వతేదీల్లో నిర్వహించే ఏపీ హాకీ చాంపియన్‌షిప్-2025 పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీటీ కోచ్‌లు చౌడేశ్వరిప్రసాద్, శంకర్, దేవకి, పీఈటీ వెంకటేష్, అక్రమ్‌భాషా తదితరులు పాల్గొన్నారు.

## శివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో పురాతన ఆలయమైన మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో బుధవారం శివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఉదయం కాశీ విశ్వేశ్వరుడికి సుప్రభాతసేవ నిర్వహించారు. అనంతరం కలశస్థాపన, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, విశేష అలంకరణలు, ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచికగా ధ్వజారోహణను వేదమంత్రోచ్చారణ నడుమ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో స్వామివార్ల ఉత్సవమూర్తులకు వినియోగించే దీక్షా వస్త్రాలు, పూజా ద్రవ్యాలను ఆలయ అనువంశీకుడు హోసూరు రామ సుబ్రహ్మణ్యం చేతులమీదుగా ప్రధానార్చకుడు నరసింహశాస్త్రికి అందజేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన మయూర వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తిని ఆశీనులు గావించి మొదటిరోడ్డు, రెండవ రోడ్లమీదుగా ఊరేగించారు. కార్యక్రమంలో ఈఓ రమేష్‌బాబు, నరేంద్ర చౌదరి, ఎర్రిస్వామి, భక్తులు పాల్గొన్నారు.


బ్రహ్మోత్సవాల ఆరంభ సూచికగా ధ్వజారోహణ చేస్తున్న దృశ్యం

## సంక్షిప్త వార్తలు

### పేకాటరాయుళ్ల అరెస్టు

తాడిపత్రి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జల దిన్నె గ్రామశివారులో పేకాట కేంద్రంపై బుధవారం దాడులు నిర్వహించి ముగ్గురు పేకాటరాయుళ్లను అరెస్టుచేసి వారివద్ద నుంచి రూ.5600 నగదుతోపాటు 52పేకముక్కలు స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడులు చేశామని చెప్పారు. సిబ్బంది పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలోని కాలువపల్లిలో పేకాటాడుతున్న 12 మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు. అలాగే వారి నుంచి రూ. 5220లు స్వాధీనం చేసుకున్నామని, అనంతరం వారిపూ కేసు నమోదు చేశామని చెప్పారు.

### ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ

ఉరవకొండ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌ను జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అలాగే స్టేషన్ పరిధిలోని నేరాలపై సిబ్బందితో సమీక్షించారు. తర్వాత విడపనకల్లు, డొనేకల్లు చెక్‌పోస్టులను, అక్కడి సీసీ కెమెరాలను ఆయన పరిశీలించారు. అదేవిధంగా విడపనకల్లులోని మద్యం షాపును తనిఖీ చేశారు. ఏఈఎస్ రేవతి, ఉరవకొండ సీఐ రవిచంద్ర, బీఎంపీటీ ఇన్‌స్పెక్టర్ కవిత పాల్గొన్నారు.

### టీడీపీ కార్యకర్తకు అభినందనలు


పార్టీ చిహ్నం అందిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

పుట్లూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధికారిక యాప్‌లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను, పార్టీ నిర్వహించే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి చైతన్యపరచడంతో మండలంలోని గోపరాజుపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త దస్తగిరిని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అభినందించారు. అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం దస్తగిరికి ఎమ్మెల్యే పార్టీ చిహ్నాన్ని గుర్తుగా అందించి అభినందించారు.

### శివరాత్రి ఉత్సవాలకు రండి


కరపత్రాన్ని ఎమ్మెల్యేకు అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట వీధిలో గల భవాని శంకరస్వామి ఆలయంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబుకు కరపత్రం అందించి ఆహ్వానించారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద బుధవారం వారు ఎమ్మెల్యేను కలిసి మాట్లాడారు. ఈనెల 26న ఈ ఆలయంలో పెద్దఎత్తున మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని, పాల్గొనాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

### బొప్పాయి చెట్ల నరికివేత

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలప్పదొడ్డి గ్రామ పంచాయతీ సర్పంచ్ రామ్మోహన్‌కు చెందిన బొప్పాయి చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. తన స్వగ్రామం ఎనకల్లులో ఐదు ఎకరాలలో ఐదు వేల బొప్పాయి మొక్కలను ఇటీవల సాగు చేశానని, అయితే అవి ప్రస్తుతం పూత దశకు వచ్చాయని, కాగా గుర్తుతెలియని వ్యక్తులు 70 చెట్లను నరికివేశారని బాధితుడు వాపోయారు. బుధవారం ఉదయం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి.. వాటిని గుర్తించానని తెలిపారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తనకు ఎవరితోను శత్రుత్వం లేదన్నారు. ఆ ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



# కమనీయం.. నారసింహుడి కల్యాణం

● పెద్దఎత్తున పాల్గొన్న భక్తజనం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాంపల్లి గ్రామంలో కొండ మీద వెలసిన పెద్దకదిరప్ప స్వామి ఆలయంలో బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ఉదయమే అర్చకులు ఆలయంలోని పెద్దకదిరప్ప స్వామి వారి మూలవిరాట్‌కు పానకాభిషేకం, అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 9గంటలకు ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణం చేశారు. అలాగే 49 జంటలకు సామూహిక వివాహాలు జరిపించారు. తర్వాత సాయంత్రం 4గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంలో కొలువుదీర్చి మేళాతాళాలతో, భక్తజనం నడుమ రథోత్సవాన్ని నిర్వహించారు. గురువారం రాతిదూలం లాగుడుపోటీలను నిర్వహిస్తారని ఆలయ అర్చకుడు రామాంజనేయులు తెలిపారు.

**స్వామి సేవలో ఎమ్మెల్యే గుమ్మనూరు, ఎంపీ అంబికా**

పెద్ద కదిరప్పస్వామిని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం దర్శించుకుని పూజలు, అర్చనలు జరిపించారు. అనంతరం సామూహిక వివాహాల్లో పాల్గొని నూతన వధూవరులకు వస్త్రాలను అందజేశారు. అలాగే ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు. నూతన వధూవరులకు సొంతఖర్చులతో బహుమతులు అందజేశారు. టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు, బండారు ఆనంద్, తలారిమస్తానప్ప, పత్తిహిమబిందు తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేకాలంకరణలో ఉత్సవమూర్తులు


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

### కందుల కొనుగోలు కేంద్రాల తనిఖీ

కళ్యాణదుర్గం/బెళుగుప్ప ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్‌యార్డులో గల కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీఓ వసంతబాబు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడున్న రైతులతో సమస్యలనడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడి సిబ్బందితో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రానికి రైతులు కందులను తీసుకొచ్చిన వెంటనే ఆలస్యం చేయకుండా కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు ఇబ్బంది పడకుండా చూడాల్సిన బాధ్యత ఏజెన్సీ వారిదేనని తెలిపారు. తూకాల్లోను, ధరల్లోను ఎటువంటి వ్యత్యాసాలు లేకుండా చూడాలని చెప్పారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఆయన బెళుగుప్ప మండలంలోని అంకంపల్లి, బెళుగుప్ప గ్రామాలలో గల కందుల కొను గోలు కేంద్రాలను తనిఖీ చేసి అక్కడి రికార్డులను పరిశీలించారు. కందులు విక్రయించిన రైతులకు సత్వరమే నగదును బ్యాంకు ఖాతాలోకి జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్ సిబ్బందికి సూచించారు. తర్వాత అక్కడి భూరీసర్వేను తనిఖీ చేశారు. తహసీల్దార్ షర్మిల, సర్వేయర్లు పాల్గొన్నారు.

# జగన్‌కు రాష్ట్రంలో తిరిగే అర్హత లేదు: ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని ధిక్కరిస్తూ.. వల్లభనేని వంశీ లాంటి నేరస్థులకు కొమ్ముకాస్తున్న వైఎస్ జగన్‌కు రాష్ట్రంలో తిరిగే అర్హత లేదని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో జగన్ దుశ్శాసనుడి పాత్ర పోషిస్తున్నారని ధ్వజమెత్తారు. శాంతి భద్రతల పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న పోలీసులనే బట్టలు ఊడదీయించి బజారు కీడుస్తానంటూ హెచ్చరించడం సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. బాధ్యత కలిగిన ఓ మాజీ సీఎం ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఇలాంటి వ్యక్తి ఎమ్మెల్యేగా కూడా అనర్హుడని అన్నారు. తిరిగి తానే అధికారంలోకి వస్తానంటూ జగన్ పగటి కలలు కంటున్నారన్నారని, రాబోయే 20 ఏళ్ల చంద్రబాబే ముఖ్యమంత్రిగా కొనసాగుతారని స్పష్టం చేశారు. నేరారోపణలు ఎదుర్కొంటున్న వల్లభనేని వంశీని పోలీసులు అరెస్టు చేస్తే జగన్ జైలుకు వెళ్లి పరామర్శించడం చూస్తుంటే.. నేరస్థులకు కొమ్ముకాస్తున్నట్లు స్పష్టం అవుతోందని అన్నారు. గత ఐదేళ్ల పాలనలో జగన్ రాష్ట్రాన్ని అన్ని విధాలా దివాలా తీయించారని, చంద్రబాబు సీఎం అయ్యాక మళ్లీ ఇప్పుడిప్పుడే అభివృద్ధికి బాటలు పడుతున్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అంతేకాకుండా తప్పు చేసేవారు భయపడే విధంగా పాలన సాగుతోందని తెలిపారు.


మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

**ఆరోగ్య పరిరక్షణకు వ్యాయామం అవసరం**

నేటి యువత ఆరోగ్య పరిరక్షణపై దృష్టి పెట్టి రోజూ వ్యాయామం చేయాలని కాలవ శ్రీనివాసులు సూచించారు. దక్షిణభారతదేశ స్థాయి బాడీబిల్డర్ పోటీలలో తృతీయ బహుమతిని సాధించిన రాయదుర్గం పట్టణానికి చెందిన దస్తగిరిని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆయన శాలువా కప్పి సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికి వ్యాయామం అవసరమన్నారు. దస్తగిరిని ఆదర్శంగా తీసుకుని నేటి యువత ముందుకెళ్లాలని సూచించారు. టీడీపీ నాయకులు పసుపులేటి నాగరాజు, నల్లపూల వెంకటేశులు, బండి క్రిష్ణమూర్తి, బంగి శంకర్, షబ్బీర్, సిమెంట్ శీన తదితరులు పాల్గొన్నారు.

### రేపు ఇంటర్వ్యూలు

గుత్తి/బెళుగుప్ప/ బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 21వ తేదీన పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు స్తున్నట్లు మున్సిపల్ జబ్బర్‌మియా బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తారన్నారు. బ్యాంకు మేనేజర్లు దరఖాస్తుదారుల ధ్రువపత్రాలను పరిశీలిస్తారన్నారు. ఇంటర్వ్యూలకు వచ్చేటప్పుడు దరఖాస్తు చేసుకున్న ఫారం, ఆధార్, రేషన్‌కార్డులు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, బ్యాంకు పాస్‌పుస్తకం తీసుకురావాలని ఆయన సూచించారు. అలాగే బెళుగుప్ప, బ్రహ్మసముద్రం మండలాల్లో వివిధ కార్పొరేషన్ల కింద సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 21వ తేదీన ఆయా మండలకేంద్రాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓలు లక్ష్మీనారాయణ నందకిశోర్ ప్రకటనలలో తెలిపారు. దరఖాస్తుదారులు ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

### హుండీ కానుకల లెక్కింపు

బెళుగుప్ప, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో బూదిగుమ్మలో గల ఆంజనేయ స్వామి, వెంకటరమణస్వామి ఆలయాల్లోగల హుండీల కానుకల్ని బుధవారం లెక్కించారు. ఆంజనేయస్వామి ఆలయ హుండీ ద్వారా 1,36,850లు, వెంకటరమణస్వామి ఆలయ హుండీ ద్వారా 1,8,605లు ఆదాయం వచ్చినట్లు ఆలయాల కమిటీ ఛైర్మెన్లు ఎర్రిస్వామి, శంకరప్ప తెలిపారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి అక్కిరెడ్డి, సూపర్‌వైజర్ వెంకటేశులు, ఇన్‌స్పెక్టర్, వన్నూరుస్వామి, గ్రామస్థులు పాల్గొన్నారు.

### సజావుగా దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ కింద సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న 189 మందికి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. బ్యాంక్ అధికారులు దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 66 యూనిట్లు మంజూరు కాగా 602 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన 413 మందికి 22వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు

కణేకల్లు: మండల వ్యాప్తంగా బీసీ, ఓసీ ఇతర కార్పొరేషన్ల రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓ ప్రసాద్‌తో పాటు పలు బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు చేసి సర్టిఫికెట్లను పరిశీలించారు.

### దరఖాస్తుల పరిశీలన

యాడికి, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): సబ్సిడీ రుణాల మంజూరు కోసం బుధవారం నిర్వహించిన దరఖాస్తుల పరిశీలన సజావుగా కొనసాగింది. వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాలు పొందడానికి మండలవ్యాప్తంగా 735మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 281 దరఖాస్తులను బ్యాంకర్లు పరిశీలన పూర్తి చేశారు. ఎంపీడీఓ వీరరాజు, ఈఓపీఆర్‌డీ శశికళ, ఏఓ నాగేశ్వర్‌రెడ్డి, పలువురు బ్యాంకర్లు పాల్గొన్నారు.

శెట్టూరు: మండలంలో వివిధ కార్పొరేషన్ల కింద రుణాల కోసం వచ్చిన దరఖాస్తులను మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో స్థానిక ఆంధ్ర ప్రగతి బ్యాంకు మేనేజర్ మణికంఠ, ములకలేడు యూనియన్ బ్యాంకు మేనేజర్ జగదీష్ కుమార్, ఎంపీడీఓ రఘురామారావు పరిశీలించారు. లబ్ధిదారుల వివరాలను పరిశీలించి అనంతరం అర్హులను చేస్తామని వారు తెలిపారు.

### ఆ వైద్యులపై చర్యలు తీసుకోవాలని వినతి

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బొమ్మనహాళ్, శ్రీధరఘట్ట గ్రామాలలో విధులకు వెళ్లకుండా బళ్లారిలో ప్రైవేటు క్లినిక్‌లు పెట్టుకుని అక్రమ సంపాదనపై దృష్టి పెట్టిన ఇద్దరు వైద్యులపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ సంతోష్‌కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొట్రేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా వైద్య పరిపాలన అధికారి గిరిజామనోహర్‌కు వినతిపత్రం అందించారు. ఆ వెద్యులపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి వారు స్పందించారు.

### హెల్త్ క్లినిక్ తనిఖీ

పామిడి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామరాజుపల్లి హెల్త్ క్లినిక్‌ను మంగళవారం అడిషనల్ డైరెక్టర్ అఫ్ హెల్త్ అండ్ వెల్ఫేర్ డాక్టర్ అనిల్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 14 రకాల ల్యాబ్ పరీక్షలు ఎలా చేయాలో అక్కడి సిబ్బందికి వివరించారు. అదేవిధంగా లెప్రసీ కేసులను పరిశీలించారు.

### టీడీపీలోకి చేరిక


టీడీపీలోకి చేరిన వైసీపీ నాయకులు

ఉరవకొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నమష్టూరుకు చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. జిల్లాకేంద్రంలోని రాంనగర్‌లో ఉన్న మంత్రి పయ్యావుల కేశవ్ నివాసంలో బుధవారం వారు టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పయ్యావుల శ్రీనివాసులు కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. చేరినవారిలో కృష్ణ, లోకనాథ్, సునీల్, సాయి, మారుతి, ధనుంజయ, బాలాజీ, బాలకృష్ణ, మంజుల తదితరులు ఉన్నారు. టీడీపీ నాయకులు సెట్టిం రాంబాబు పాల్గొన్నారు.

### టీడీపీతోనే నాయీబ్రాహ్మణులకు లబ్ధి

గుంతకల్లు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే రాష్ట్రంలోని నాయీ బ్రాహ్మణులకు ఆర్థిక, రాజకీయ లబ్ధి చేకూరిందని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ ఆర్ సదాశివం పేర్కొన్నారు. పట్టణంలోని నాయీ బ్రాహ్మణ సేవా సంఘ నాయకులు సదాశివంను బుధవారం సాయంత్రం ఆహ్వానించి నాయీ బ్రాహ్మణ కాలనీల్లో నెలకొన్న సమస్యలు, కులస్థులు, వృత్తిదారుల సమస్యలను వివరించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం నాయీబ్రాహ్మణులకు ఆదరణ-3 కింద పనిముట్లను, కార్పొరేషన్ రుణాలను త్వరలో అందజేయనున్నట్లు చెప్పారు. నాయీ బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్పొరేషన్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

# ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ 395వ జయంతి వేడుకలను పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ సంస్థల సభ్యులు శివాజీ చిత్రపటాన్ని ప్రత్యేక రథంపై ఉంచి చేసి స్థానిక డబ్బీదార్ ఫిర్కా పాండురంగస్వామి ఆలయం నుంచి పలు వీధుల మీదుగా శివాజీ విగ్రహం వరకు ఊరేగించారు. అనంతరం విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాయదుర్గం, తాడిపత్రి, గుత్తి పట్టణాలతో పాటు యాడికి మండలకేంద్రంలో శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు.


పామిడిలో రథంపై శివాజీ చిత్రపటం ఊరేగింపు